# కర్నూలు | నంద్యాల
# వార్త
22 అక్టోబర్ , 2024 మంగళవారం పేజీలు 4


## సియం కార్యాలయం నుండి వచ్చి ప్రజాపిర్యాదులపై.. ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి



**నంద్యాల, అక్టోబరు 21, ప్రభాతవార్తప్రతినిధి**

రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చిన ప్రజా పిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పరిస్కారించాలని కలెక్టరు రాజకుమారి జిల్లా అదికారులను అదేశించారు. సోమవారము కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్లో ప్రజా సమస్యల పరిస్కార వేదికలో కలెక్టరు పిర్యాదులను స్వీకరించారు. ఇందులో జేపి విష్ణుచరణ్ డిఅర్ఓ పద్మజ, పాల్గొన్నారు. ఈసందర్భముగా కలెక్టరు మాట్లాడుతూ సియం కార్యాలయం నుండి వచ్చిన పిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువులో పరిసా ్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలనా ్ననరు. పిర్యాదులకు సంబందించి సరిఅయిన ఉండా ర్స్మెంట్ ఇవ్వడము లేదని 72గంటలకు మంచి ఒక్క గ్రీవెన్సు కూడా పెండింగులో ఉండకూడదని కలెక్టరు చెప్పారు. యనకండ్ల గ్రామంనివాసిఒ యంరామయ్య సర్వేనెంబరు 492లో మా నాన్న పేరిట ఉన్న ఎకరా పొలం గత 13 సంవత్సరాల నుండి మా తమ్ముడు అనుభవిస్తున్నాడని సంబందిత పొలాన్ని ఇద్దరు అన్నదమ్ములకు పంచాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. గడివేముల మండలంలోని గడిరేవుల గ్రామ ప్రజలు ప్రమాదకరంగా శిథిలావస్థలో ఉన్న నీళ్ల ట్యాంకుని కూల్చివేసేందుకు చర్యలు తీసుకోవాలని అర్జి పెట్టారు. ఇంకా 211 అర్జిలు అందాయని కలెక్టరు చెప్పారు.

# చిరుత..చిరుత..చిరుత..!

- అటు పిడుగు వాన.. ఇటు రైతు గుండెల్లో చిరుత పంజా..
- పొలాల్లో తిరిగిన అటవీశాఖ అధికారులు







**పిడుగులాంటి వాన, రైతుల గుండెల్లో చిరుత పంజా.. ఈ రెండింటికి అంతకుమించి వాట్సాప్ మీడియాలో పుకార్లు, చిరుత ఫోటో వాట్సాప్‌లో హల్‌చల్... పండించి చేతికొచ్చిన మంచి దిగుబడి పంటను కోతకోస్తే ఎడతెరిపిలేని వాన, సరే పొలం పరిస్థితి ఎలా ఉందోనని చూద్దామంటే చిరుత సంచార. నాన్న పులి వచ్చే అన్నచందంగా అదిగో చిరుత... ఇదిగో చిరుత అంటూ పుకార్లు షికార్లు చేయడం, పొలాల్లో ఏ అడుగులు కనిపించినా అవి చిరుత పాదాల అడుగులుగానే నిర్ధారించి ఊహించుకోవడం. దీంతో రైతులు తమ పొలాలకు వెళ్లాలంటే ముచ్చెమటలు పడుతున్నాయి. దీంతో అటవీశాఖ అధికారులకు కూడా చిరుత సంచారంపై కంటిమీద కునుకు లేకుండా ఎటూ తేల్చుకోలేక తీవ్ర ఒత్తిడికి గురవుతున్నార.**

**మిడుతూరు, అక్టోబర్21, ప్రభాతవార్త;**

మిడుతూరు మండల సమ్మర్ స్టోరేజీ ఆవరణలో ఇటీవల చిరుత సంచారం దాని పాదాల అడుగుజాడలను చిరుతవిగా అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఒక అప్పటినుంచి డైరెక్టర్ రాజమౌళి సినిమా షూటింగ్ మొదలయ్యింది. ఎందుకంటే రాజమౌళి తన సినిమాను అంత తొందరగా ముగించడు. దాదాపు 5 సంవత్సరాలు పడుతుంది. ఈ విషయం సినీ ఫీల్డ్ వారే ఒప్పుకుంటారు. మరి చిరుత సంచారం పుకార్లు ఇక్కడ మరిన్ని రోజులు వినాలి. ఆ డైరెక్టర్ షూటింగ్‌లా ముందుకు సాగుతుంది. కనీసంపొలాలు పరిశీలించడానికి వెళ్లాలంటే భయం. ఏవైపు నుంచి చిరుత వస్తుందోనని రైతులు భయాందోళనకు గురవుతున్నారు. రైతులు తమ ఆశలన్నీ మొక్కజొన్న పంటపైనే పెట్టుకున్నారు. దాదాపు పంట దిగుబడి కూడా మంచిగా వచ్చింది. ఏరోజుకారోజు అక్కడ చిరుత సంచరిస్తుంది, మేము చూశము అనే ప్రచారం శరవేగంగా పల్లెలకు పాకి పోతుంది. అయితే చిరుత సంచార జీవి అంటారు. అది ఒకచోట స్థిరంగా ఉండదంటారు. ప్రతిరోజూ దాదాపు 22 కి.మీ. నడక్పరరయాణం చేస్తుందంటారు. అయితే ఇప్పటికీ ఆ విధంగా చిరుత మన పరిసర ప్రాంతాల నుంచి వెళ్లిపోయి ఉంటు ందని కొందరు అభిప్రాయ పడుతు న్నారు. అయితే మరోసారి సోమవారం చిరుత సంచారం పై ప్రచారం జరిగింది. దీంతో స్పందించిన డీఆర్వో తాహీర్, తన సిబ్బందితో బలపాల గోపాలస్వామికి చెందిన పొలాలతోపాటు ఎదురుగా మొక్కజొన్న పంటల్లో చిరుత అడుగుజాడల కోసం పరిశీలించారు. అయితే చిరుత సంచారంపై అటవీశఖ అధికారులు నిర్ధారించలేదు. మిడుతూరు సమీపంలోని సమ్మర్‌స్టోరేజ ట్యాంకు పరివాహక ప్రాంతాల్లల మినహా ఇప్పటివరకు చిరుత సంచరించిన పాదాల అడుగులను మరొకచోట గుర్తించలేదు. మరి ఎటూ తేల్చుకోలేని పరిస్థితి. ఏది ఏమైనా రైతులు పొలాలకు వెళ్లక తప్పదు. కనుక కొన్ని జాగ్రత్తలతో ఒంటరిగా కాకుండా ముగ్గురు లేదా నలుగురితో వెళ్లాల్సిన పరిస్థితి తప్పదు.

# ఆర్‌ఎంపిల చేతి మాత్ర..వైకుంఠయాత్ర..!



- ప్రథమ చికిత్స కాదు.. ఏకంగా శస్త్రచికిత్సలు చేస్తున్న శంకర్‌దాదాలు?
- ప్యాపిలిలో రెచ్చిపోతున్న వైద్యులు కాని వైద్యశిఖామణులు
- సెలైన్ బాటిల్ పెడుతున్న ఆర్‌ఎంపిలు
- కమీషన్ల కోసం ప్రసవకేసులను డోన్, కర్నూలుకు రెఫర్
- వైద్యాధికారుల తనిఖీలు శూన్యం..!

**వైద్య విద్యను అభ్యసించి ప్రభుత్వం నిర్వహించే అర్హత పరీక్ష ఉత్తీర్ణత సాధించిన వారే ఆసుపత్రిని పెట్టి రోగులకు వైద్యసేవలను అందించడానికి ప్రభుత్వం అనుమతి ఇస్తుంది. ప్రస్తుతం ఎంబిబిఎస్ చదివిన డాక్టర్ల కంటే ఆర్‌ఎంపిలు (శంకర్‌దాదాలు)వైద్యుల అవతారమెత్తి అమాయక ప్రజల ప్రాణాలను హరిస్తున్నారు. ప్రాథమిక చికిత్స మాత్రమే అందించాల్సిన శంకర్‌దాదాలు రెచ్చిపోయి అపరేషన్లను కూడ చేసేస్తున్నారు..? ఎంబిబిఎస్ చదివిన డాక్టరు కంటే ఆర్‌ఎంపిల వద్దకే ప్రజలు పరుగులు పెడుతూప్రాణాలను పణంగా పెడుతున్నారు. వైద్యం చేయడానికి అర్హత లేని ఆర్‌ఎంపిలు మాత్రం వచ్చిరాని వైద్యం చేస్తూ ప్రజల నుండి డబ్బులను వసూలు చేస్తూ అనతికాలంలోనే లక్షలాది రూపాయలను అర్జిస్తున్నారు. తనిఖీలు నిర్వహించి శంకర్‌దాదా ఎంబిబిఎస్‌లను నివారించాల్సిన వైద్యశాఖ అధికారులు మాత్రం నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహరిస్తూ నిర్లక్ష్యం బాటన పయనిస్తున్నారు. మండల కేంద్రమైన ప్యాపిలి పట్టణంలో ఆర్‌ఎంపిల చేతి మాత్ర..వైకుంఠయాత్రలా కొనసాగుతున్న శంకర్‌దాదాల మాయజాలంపై.. ప్రభాతవార్త కథనం.**

**ప్యాపిలి అక్టోబరు21ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన ప్యాపిలి పట్టణంలోని ఆర్‌ఎంపిలు హవాను కొనసాగిస్తున్నారు. ఎంబిబిఎస్ డాక్టర్లను తలదన్నే విధంగా ప్యాపిలిలో శంకర్‌దాదాలు రెచ్చిపోతున్నారు. చదివింది అంతంత మాత్రమే..చేసేది మాత్రం కార్పోరేట్ రేంజ్‌లో వైద్యం అన్న రీతిలో ఆర్‌ఎంపిలు వ్యవహరిస్తున్నారు. పట్టణంలోని బస్టాండు, మెయిన్‌బజారు, రద్దీ ప్రాంతాలలో క్లీనిక్‌లను ఏర్పాటు చేసుకుని మూడు మంచాలు, ఆరు సెలైన్ బాటిళ్ళలతో ఆర్‌ఎంపిలు దందాను సాగిస్తు న్నారు. అదే విధంగా రక్తపరీక్షల కేంద్రం, సోంతంగా మెడికల్‌షాపులను బినామిలతో ఏర్పాటు చేసుకుని ప్రజల నుండి అందినంతమేరకు దండుకుంటున్నారు. ల్యాబ్‌టెక్నిషియన్, డిఫార్మాసి ధృవీకరణ ప్రతాలు ఒకరిపేరుతో ఉంటే మరోకరు మెడికల్ షాపు, ల్యాబ్‌ను నిర్వహిస్తూ ప్రభుత్వాన్ని, ప్రజలను నట్టేట ముంచుతున్నారు. వచ్చిరాని వైద్యం అందించి ప్రాణాలను తీసిన సంఘటనలు జరిగిన సమయంలో రాయబారాలు నడిపి రాజీ కావడం అనవాయితీగా పెట్టుకున్నారు. ప్రాథమిక వైద్యం చేయాల్సిన శంకర్ దాదాలు ఏకంగా కాన్పుల కేసులను కూడ తీసుకుని కమీషన్ల కోసం డోన్, కర్నూలు ప్రాంతాలలోని ప్రవేటు ఆసుపత్రులకు రెఫర్ చేసి చేతివాటాన్ని ప్రదర్శిసు న్నారు. వైద్యం అందించడానికి ఆర్‌ఎంపిలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రథమ చికిత్స చేయాల్సిన ఆర్‌ఎంపిలు ఏకంగా రోగులకు సెలైన్ బాటిళ్లను పెట్టడం, ఇంజక్షన్‌లు వేయడం చేస్తూ ప్రజల పాలిట యమ కింకరుల్లా మారిపోతున్నారు. శంకర్‌దాదాలు వచ్చిరాని వైద్యంతో అధిక డోస్ మాత్రలు రాసి ఇచ్చి ప్రజల ప్రాణాలను యమపురికి పంపిస్తున్నారు. తమ వద్దకు వచ్చిన వారికి సిరియస్‌గా ఉంటే క్షణాల మీద కర్నూలుకు వెళ్ళాలని చెపుతూ చేతులు దులుపుకుంటున్నారు. ప్రజలు కూడ ఎంబిబిఎస్ డాక్టర్ల కంటే ఎటువంటి అర్హత లేని శంకర్‌దాదాల వద్దకే పరుగులు తీస్తూ ప్రాణాల మీదకు వచ్చిన తరువాత వైద్యుల వద్దకు ఉరుకులు పరుగులతో వెళ్ళిపోతున్నారు. ఆర్‌ఎంపిల వైద్య కేంద్రాలపై తనిఖీలు చేయాల్సిన జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు కూడ శంకర్ దాదాలను పట్టించు కోకుండ వదిలేశారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైన ప్యాపిలిలో రెచ్చిపోతున్న ఆర్‌ఎంపిలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.



# యోగా పేరుతో.. వ్యాపారం..!

- ఉచితం పేరుతో దగా....
- కోట్ల రూపాయల విలువైన మున్సిపల్ స్థలం ఆక్రమణ...

**యోగా సెంటర్ పేరుతో నెలకు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వసూలు చేస్తు ఉచితం పేరుతో దగా చేస్తు కోట్ల రూపాయల మున్సిపల్ స్థలం ఆక్రమణకు గురవుతున్నది. గాంధీచౌక్‌లో రోడ్లపై వ్యాపారం చేసుకుని పొట్టపోసుకునే చిరు వ్యాపారులను ఖాళీ చేయించి వారి కడుపు కొట్టిన అధికారులకు కోట్ల విలువైన మున్సిపల్ స్థలం ఆక్రమిస్తే ఖాళీ చేయించరా...? ఉదయం.., మధ్యాహ్నం...రాత్రి ఆరోగ్య సూత్రాల పేరుతో ఆహారపదార్థాల పంపిణి నెలకు ఒక్కొక్కరి నుంచి రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలుచేస్తు ప్రతినెల 100 మందికి పైగా యోగా సెంటర్‌లో ఆరోగ్యసూత్రాల పేరుతో ఆహారపదార్థాలు పొందుతున్న వైనం. యోగా సెంటర్‌కు ఏప్రాతిపదికన మున్సిపల్ అధికారులు స్థలం కేటాయించారో అధికారిక పత్రాలు చూపాలని!! ఎంతకాలానికి స్థలం ఇచ్చారో కూడ బహిరంగంగా ప్రకటించాలి!**

**నంద్యాల, అక్టోబర్ 21, ప్రభాతవార్త ప్రతినిధిః**

మున్సిపల్ స్థలం ఏ ప్రాతిపదికన కేటాయించి ఇచ్చారు. మున్సిపల్ స్థలంలో శాశ్వత కట్టడాలు నిర్మించ రాదని ఉన్న రూలుకు సంబంధించి అన్ని విషయాలు మున్సిపల్ అధికారులు బహిర్గతం చేయాలి. యోగా సెంటర్‌కు మతం రంగు పులిమి గందరగోళం సృష్టించేందుకు త్రీ ఇడియట్స్ చేస్తున్న ప్రయత్నాలు ప్రజలు నమ్మేస్థితిలో లేరు. త్రీ ఇడియట్స్ దెబ్బకు రాష్ట్రంలోనే అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న అధికార పార్టీ ప్రజాప్రతినిధుల్లో మొదటి వరుసలోకి చేరిన నంద్యాల మంత్రివర్యులు. త్రీ ఇడియట్స్ చేస్తున్న ప్రాపగండకు మంత్రి పదవీ గండం ముంచుకొస్తుందని మంత్రి అనుచరుల గగ్గోలు. మున్సిపల్ టౌన్ ప్రాంగణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు మంత్రి నిధులు కేటాయిస్తే ఎలాగైనా ఆ నిధులను వెనక్కి పంపించేందుకు యోగా సెంటర్ వ్యవహారాన్ని తెరపైకి తీసుకువచ్చిన త్రీ ఇడియట్స్. యోగా గురువు కాదు!! ఆయన ఒక చీటర్!! తన వ్యవహారమంతా నంద్యాల ప్రజలకు తెలుసు. ఏకంగా మంత్రి నిర్ణయాన్ని అమలు కాకుండా అడ్డుకునే స్థాయికి చేరిన త్రీ ఇడియట్స్ వ్యవహారం. ఏ ఉద్దేశ్యంతో మున్సిపల్‌టౌన్ హాల్‌ను నిర్మించారు...అదే ఉద్దేశాన్ని కొనసాగిస్తు మరింత అభివృద్ధి చేయాలి. కళా సాంస్కృతిక రంగాల అభ్యున్నతి కోసం నిర్మించిన టౌన్ హాల్ ప్రాంగణాన్ని మొత్తం అదే రంగాలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలి. యోగా పేరుతో వ్యాపారం చేస్తు నెల నెల లక్షల రూపాయలు ఆర్జిస్తు పబ్బం గడుపుకుంటున్న వారిని వెంటనే ఖాళీ చేయించాలి. నిబంధనలకు విరుద్ధంగా కట్టిన శాశ్వత కట్టడాలను వెంటనే తొలగించాలి. కులాలకు, మతాలకు సంబంధం లేదు. రాజకీయాలకు అసలే సంబంధం లేదు. స్వార్థం కోసం పబ్బం గడుపుకుంటున్న వారికి అందుకు వత్తాసు పలుకుతున్న త్రీ ఇడియట్స్ వ్యవహారంపై రాష్ట్ర మంత్రి ఫరూక్ దృష్టి సారించాలి. గతంలో మున్సిపల్ శాఖ మంత్రిగా టౌన్ హాల్‌ను ఏ ఉద్దేశ్యంతో నిర్మించారో అదేస్థలం అన్యాక్రాంతమైన డ్రాయింగ్‌ను కాపాడాల్సిన బాధ్యత మంత్రి ఫరూక్‌పై ఉంది. యోగా పేరుతో వ్యాపారం చేసుకుంటారో? ఇంకేమైనా చేసుకుంటారో? మున్సిపల్ స్థలాన్ని ఖాళీ చేసి ఎక్కడైనా చేసుకోండి. ఎవరు అడ్డుచెప్పమని నంద్యాల ప్రజలు కోరుతున్నారు.

# పైరవీల.. జాతర..!



- కేజీబీవీ ఉద్యోగాలకు భారీగా సిఫారసు లేఖలు
- నాన్ టీచింగ్ ఉద్యోగాలకై నాయకుల ఒత్తిడి
- రికమండేషన్ లెటర్లకు చేతులు మారుతున్న పెద్ద మొత్తాలు

**అధికారం మాది.. మా సిఫారసే అర్హత.. అంటూ కొందరు నాయకులు సిఫారసు లేఖలు ఇస్తున్నారు. ఆ లేఖల కోసం అభ్యర్థులు నానా పాట్లు పడుతున్నారు. దీంతో ఉపాధ్యాయ ఉద్యోగాలకు అర్హతలు ముఖ్యమా.. నాయకుల సిఫారసులు ముఖ్యమా.. అనే అనుమానాలు వస్తున్నాయి. సిఫారసుతో వచ్చిన పంతుళ్లు పైరవీలకే పనికొస్తారు కానీ.. పాఠాలు చెప్పేందుకు పనికిరారన్నది జగమెరిగిన సత్యం.. అయినప్పటికీ టీచర్ ఉద్యోగాలు మా రికమండేషన్ లెటర్‌లకే ఇవ్వాలంటున్నారు కొందరు నాయకులు. ఇక నాన్ టీచింగ్ ఉద్యోగాలు అయితే... వెనక ముందు ఏది అవసరం లేదు.. పైరవీనే ప్రామాణికంగా తీసుకోవాలంటున్న పరిస్థితి. ఇదంతా కేజీబీవీ ఉద్యోగాల తతంగం.**

**కర్నూలు, అక్టోబర్ 21, ప్రభాత వార్త :**

కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాల్లో ఉపాధ్యాయ పోస్టులు, ఇతర సహాయకుల పోస్టులు భర్తీ చేస్తున్నారు. సుమారు 50 టీచర్ పోస్టుల తో పాటు, 47 నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ అవుతున్న అవుతున్నాయి. ఇందుకుగాను అప్లికేషన్లు తీసుకున్నారు. వాటి స్క్రూటినీ అయిపోయింది. త్వరలో ఉద్యోగాల నియామకం కూడా జరగనుంది. అయితే ఇక్కడ ప్రధానాంశం ఏమిటంటే.. ఉద్యోగాలు పొందాలను కుంటున్న వారిలో కొందరు వేల రూపాయలు, మరికొందరు లక్షల రూపాయలు ఖర్చు పెడుతున్నారు. మరి ఆ ఖర్చు విద్యాశాఖ అధికారులకు ఇస్తున్నారా.. నాయకులకు ఇస్తున్నారా.. అనే విషయం అంతు పట్టని పరిస్థితి. అయితే ఈ కేజీబీవీ ఉద్యోగాల కోసం కొందరు నాయకులు రికమండేషన్ లేఖలు ఇచ్చారు. టీచర్ పోస్టులకు ఒక మోస్తారులో సిఫారసు లేఖలు రాగా.. నాన్ టీచింగ్ పోస్టులకు లెక్కకు మించి సిఫారసు లేఖలు వచ్చాయి. ఆ లేఖలు తెచ్చుకునేందుకు కొందరు అభ్యర్థులు నాయకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. లేఖల కోసం మొదట ద్వితీయ శ్రేణి నాయకుడి జేబు నింపాల్సిందే. తర్వాత పిఏను సంతృప్తి పరచాల్సిందే. ఆ తరువాత నాయకుల వద్ద పరిస్థితి ఆయా ప్రాంతాలను బట్టి ఉంటుంది. మొత్తానికి అభ్యర్థులు భారీగానే ఖర్చు పెడుతున్నారు.

నాన్ టీచింగ్ ఉద్యోగాలలో ఏడో తరగతి అర్హత కాగా, స్థానిక మండలంలో స్థానికులు కావడం మరో అర్హత. ఇందులో కచ్చితంగా స్థానిక నాయకుల సిఫారసు మేరకే ఈ నాన్ టీచింగ్ పోస్టులు ఉంటాయని అభ్యర్థులు గుడ్డిగా నమ్ముతున్నారు. దీంతో నాయకుల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. నాన్ టీచింగ్ ఉద్యోగాల పరిస్థితి ఇలా ఉంటే ఇక టీచింగ్ టీచర్ పోస్టుల పరిస్థితి మరోలా ఉంది టీచర్ అంటేనే క్వాలిఫికేషన్ ఉండాలి, అందులో మెరిట్ ఉండాలి. ఇక్కడ మెరిట్‌ను పక్కనపెట్టి ఉద్యోగం ఇవ్వాలని కొందరు నాయకులు కోరుతున్నట్లు సమాచారం. అలాంటి పరిస్థితిలో ఉద్యోగాలు ఇస్తే ఆ ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు విధులు నిర్వహిస్తారా లేక పైరవీలు చేస్తారా.. అర్థం కాని పరిస్థితి. ప్రస్తుత ఉద్యోగాలలో నాన్ టీచింగ్ ఉద్యోగాలకు ఎక్కువగా రికమెండేషన్ లేఖలు వచ్చాయని, టీచర్ పోస్టులకు కొన్ని మాత్రమే వచ్చాయని సమగ్ర శిక్ష అధికారులు చెబుతున్నారు. ఏది ఏమైనా ప్రస్తుత పరిస్థితులలో విద్యార్హతల కన్నా రాజకీయ నాయకుల ప్రాబల్యమే అర్హతగా చెప్పుకునే పరిస్థితులు వస్తున్నాయి. ప్రస్తుతం విద్యాశాఖ అధికారులు నాయకుల పైరవీలకే విలువ ఇస్తారా.. అర్హతలకు, ప్రభుత్వ నిబంధనలకు విలువ ఇస్తారా వేచి చూడాల్సిందే

వివరణ.. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖాధికారి శ్యాముల్‌ను ప్రభాతవార్త వివరణ కోరగా.. నాయకుల పైరవీ లేఖలు ఎన్ని ఉన్నప్పటికీ అర్హతను బట్టి ఉద్యోగాలు ఇస్తామని చెబుతున్నారు. అయితే ఎవరైనా అభ్యర్థులు విషయం తెలియక పైరవీల కోసం ప్రయత్నం చేయడం మంచిది కాదని ఆయన వివరించారు.

## భారీవర్షంతో.. వందల ఎకరాల్లో వరిపంటకు నష్టం..!

- ఈర్నపాడు, వెంగల్‌రెడ్డిపేట, శింగవరం, కడమలకాల్వలో భారీవర్షం
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల మొర



**బండిఆత్మకూరు, అక్టోబర్ 21, ప్రభాతవార్తః**

ఆరుగాలం కష్టపడి పండించిన వరిపంట చేతికివచ్చే సమయంలో అకాలవర్షంతో రైతులకు నష్టం కలిగించింది. సోమవారం సాయ ంత్రం బలమైన ఈదురుగాలులతో భారీవర్షానికి మండలంలోని వెంగల రెడ్డిపేట, ఈర్నపాడు, కడమల కాల్వ, శింగవరం గ్రామాల్లో వందలాది ఎకరాల వరిపంట నేలమట్టం అయింది. మరో 20 రోజుల్లో పంటచేతికి వచ్చే వేళ అకాలవర్షం నష్టాన్ని మిగిలించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొంత వరిపంట పొట్టదశలో పాలుపోసుకుంటున్న దశలో వరిపంట నేలవాలడంతో రైతులకు భారీనష్టాన్ని కలిగించింది. ఇప్పటికే ఎకరాకు రూ.40 వేలు పెట్టుబడి పెట్టామని ఈవర్షం భారీగా నష్టపోయామని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. వ్యవసాయ అధికారులు పంటనష్టాన్ని అంచన వేసి ప్రభుత్వానికి తెలియజేయాలని నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.



## ఫిర్యాదులు.. రీ ఓపెన్ కాకూడదు

**: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**



**కర్నూలు, అక్టోబరు 21, ప్రభాతవార్త :**

ప్రజల సమస్యలను రీ ఓపెన్ కాకుండా నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ – పిజిఆర్ఎస్) కార్యక్రమం ద్వారా జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 36 అర్జీలు రీ ఓపెన్ అయ్యాయని, అర్జీలు రీ ఓపెన్ కాకుండా ప్రజలు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు..రీ ఓపెన్ అయిన దరఖాస్తులను సంబంధిత శాఖల పై అధికారులు పరిశీలించి వారి ఎండార్స్మెంట్ ను అప్లోడ్ చేయాలని కలెక్టర్ సూచించారు. సిఎం కార్యాలయం నుండి వచ్చిన దరఖాస్తులు 30 పెండింగ్ ఉన్నాయని, ఈ సమస్యలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు..నిర్దేశించిన గడువుకు ముందే సమస్యలను పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, డిఆర్ఓ చిరంజీవి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## రీ సర్వే భూ సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి



**బనగానపల్లె, అక్టోబర్21, ప్రభాతవార్త:** రీ సర్వే భూ సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బి.నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నారాయణరెడ్డి మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో భూ సమస్యల పరిష్కార కార్యక్రమం ఈనెల 22వ తేది నుండి నవంబరు 14వ తేది వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. 2020వ సంవత్సరం నుండి 2024 వరకు చేపట్టిన భూ రీ సర్వేలో కొన్ని సమస్యలు వచ్చాయని వాటిని పరిష్కారం చేయడానికి ప్రస్తుత ప్రభుత్వం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ఆ సమస్యలు పరిష్కరించాలని జిల్లా అధికారులు ఆదేశించారని ఆయన పేర్కొన్నారు. అప్పలాపురం గ్రామంలో ఈనెల 22వ తేదీ, బీరవోలులో 23వ తేదీ, బత్తులూరుపాడులో 24వ తేదీ, చెరువుపల్లె గ్రామంలో ఈనెల 25వ తేదీ, యనకండ్ల గ్రామంలో 26, జంబులదిన్నెలో 29, జిల్లెల్లలో 30, జోలాపురంలో నవంబర్ 1వ తేదీ, కాపులపల్లె 2, మీరాపురం 5, మిట్టపల్లె గ్రామంలో 6, నిలువుగండ్ల 7, పండ్లాపురం 8, పాతపాడు 12, సంకలాపురం గ్రామంలో 13, వెంకటాపురం, విఠలాపురం గ్రామాల్లో నవంబర్ 14వ తేదిల్లో గ్రామసభలు నిర్వహిస్తారని ఆయన తెలియజేశారు. ఈ గ్రామసభల్లో రైతులు సమస్యలు తెలిపితే 15 రోజుల్లో సమస్యలు పరిష్కారమవుతాయని ప్రతి సమస్యకు రశీదు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. భూ సమస్యలకు సంబంధించిన అన్ని రకాల ఫిర్యాదులు ఈ గ్రామసభలోనే అందజేయవచ్చునన్నారు. ఈ గ్రామసభలో దరఖాస్తు ఇవ్వలేనివారు తహసీల్దార్ కార్యాయలంలో నవంబర్ 14వతేదిలోపు సమర్పించాల్సిందిగా తెలిపారు. రైతులందరూ భూ సమస్యల పరిష్కార కార్యక్రమానికి హాజరై సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

## నవీన విద్యాపథకం పై హర్షం వ్యక్తం చేసిన మైనార్టీ నాయకులు

**హోళగుంద, అక్టోబర్21, ప్రభాతవార్త:** చంద్రన్న మదర్సా నవీన విద్యా పథకం పై కూటమి ముస్లిం మైనార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లిం మైనార్టీ విద్యార్థులకు మేలు చేకూరేలా చంద్రన్న నవీన మదర్సా పథకం అమలు చేయడం హర్షించదగ్గ విషయమని తేదేపా, కూటమి మైనార్టీ నాయకులు అబ్దుల్ సుభాన్, సీబీఎన్ ఆర్మీ మోయిన్, అద్రుమాన్, తన్వీర్‌లు అన్నారు. సోమవారం మండల కేంద్రమైన హోళగుందలోని స్థానిక బస్టాండ్ పక్కలో ఉన్న మసీదు దగ్గర వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చంద్రన్న నవీన మదర్సా విద్యాపథకం ద్వారా రాష్ట్రంలోని గుర్తింపు పొందిన 185 మదర్సాల్లో విద్యావాలంటీర్ల నియామకం చేపట్టి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నరన్నారు. ఉర్దూ మాధ్యమ పాఠశాలల్లో ఉర్దూ భాష ఉపాధ్యాయులను విద్యావాలంటీర్లుగా నియమించడం ద్వారా ఉర్దూ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఒక్కొక్క మదర్సాకు ముగ్గురు చొప్పున వాలంటీర్లను నియమిస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించడం ముస్లిం మైనార్టీ సమాజంలో హర్షించదగ్గ విషయమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ముస్లిం మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి ఫరూక్, ఆలూరు తేదేపా ఇన్‌చార్జ్ వీరభద్రగౌడ్‌లకు ముస్లిం మైనార్టీ నాయకులు అబ్దుల్ సుభాన్, అబ్దుల్ రహిమాన్, ఖైసర్, అమీన్, అబుజార్, మౌలానా షాకీర్, ఇస్మాయిల్, శంషుద్దీన్, సలీమ్, అల్తాఫ్, జావీద్‌లు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## మద్యం దుకాణాన్ని తొలగించాలని ఏఐఎస్ఎఫ్ డీవైఎఫ్ఐ ఐద్వా ఆధ్వర్యంలో

**ఆలూరు రూరల్, అక్టోబర్21, ప్రభాతవార్త:** ఆలూరులోని అరికెర రోడ్డులో గల మద్యం దుకాణాన్ని తొలగించాలని ఏఐఎస్ఎఫ్, డీవైఎఫ్ఐ, ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు గోవర్ధన్, మండల కార్యదర్శి మైనా, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు ఉమేష్, మహిళా సంఘం మండల అధ్యక్షురాలు షేకున్‌బీలు మాట్లాడుతూ అరికెర రోడ్డులో గల బాలుర బీసీ హాస్టల్ మరియు బీసీ మేనేజ్‌మెంట్ కళాశాల హాస్టల్ సమీపంలో ఏర్పాటుచేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని వారు డిమాండ్ చేశారు. బీసీ హాస్టల్‌లో 6వ తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు వసతి పొందుతున్నారని అలాగే బీసీ మేనేజ్‌మెంట్ కళాశాల హాస్టల్‌లో ఇంటర్మీడియేట్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నికల్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు వసతి పొందుతున్నారని వారు తెలిపారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఈ హాస్టల్లో వసతి పొందుతూ విద్యను అభ్యసిస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ హాస్టల్‌కు దగ్గరలోనే మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజమని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం గుడి, బడి పరిసర ప్రాంతాల్లో మద్యం దుకాణాలను ఏర్పాటు చేయకూడదని నిబంధనలు ఉన్నా అతిక్రమించి మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడం సరైందికాదన్నారు. ఒక పక్క ప్రభుత్వం, అధికారులు కళాశాల, పాఠశాలల్లో మద్యం, మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాల పై అవగాహన కల్పిస్తూ సెమినార్లు నిర్వహిస్తూ మరో పక్క విద్యా సంస్థల పక్కనే మద్యం దుకాణం ఏర్పాటు బానిసలవ్వడంటూ ప్రోత్సహించి వారి జీవితాలను నాశనం చేసే విధంగా ఉందని వారు మండిపడ్డారు. వెంటనే వసతి గృహాల సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని లేనియెడల విద్యార్థులు, ప్రజా సంఘాలతో కలిసి మద్యం దుకాణాన్ని ధ్వంసం చేస్తామని వారు హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ గోవింద్‌సింగ్, ఎక్సైజ్ సీఐ లలితకు వినతిపత్రం అందజేయడం జరిగింది. దీంతో వారు స్పందించి 24వ తేదిలోగా హాస్టల్ సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని అక్కడి నుండి తొలగించి విద్యా సంస్థల పరిధిలో ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకుంటామంటూ హామీ ఇవ్వడం జరిగింది. వీరికి సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మినారాయణ, సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి కె.పి.నారాయణస్వామి, రైతు సంఘం మండల కార్యదర్శి ఈరన్న, సీఐటీయు నాయకులు కృష్ణలు మద్దతు తెలిపారు.

## జనావాసాల మధ్య మద్యం దుకాణాలను ఏర్పాటు చేయరాదు

– మహిళల ధర్నా

**గడివేముల, అక్టోబర్21, ప్రభాతవార్త,** మండలకేంద్రమైన గడివేములలోని మండల పొదుపు సమాఖ్య కార్యాలయం వద్ద, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుల వద్ద ఏర్పాటు చేయనున్న మద్యం దుకాణాలను తొలగించాలని మండల పొదుపు సంఘం మహిళలు సోమవారం ధర్నా నిర్వహించారు. లావాదేవీల నిమిత్తం బ్యాంకుకు వచ్చే ప్రజలకు, పొదుపు సంఘాల మహిళలకు ఇబ్బంది కలిగించేలా వైన్ షాపులు(మద్యం దుకాణాలు) ఏర్పాటు చేయకూడదన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పొదుపు సమాఖ్య సంఘం అధ్యక్షురాలు యల్లమ్మ, బత్తుల సుభద్రమ్మ, పొదుపు సంఘం మహిళలు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం పై అవగాహన సదస్సు

**హోళగుంద, అక్టోబర్21, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన హోళగుందలోని స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ చట్టం పై అవగాహన కార్యక్రమం మండల వ్యవసాయాధికారి ఆనంద్ లోకదళ్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి ఆనంద్ లోకదళ్ మాట్లాడుతూ సమాచార హక్కుచట్టం-2005 ప్రకారం ప్రభుత్వ శాఖ పరిధిలోని ప్రతి సమాచారాన్ని రాతపూర్వకంగా ప్రజలు ఎవరైనా అడిగే హక్కు ఉందని ఆయా సమాచారాన్ని 30 రోజుల వ్యవధిలో అందిస్తామని వారు పేర్కొన్నారు. నిర్ణీత సమయంలో సమాచారం అందించకపోతే ఉన్నతాధికారులకు అప్పీలు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. అలాగే సమాచార హక్కు చట్టాన్ని ప్రజలు ఎవరైనా ఉపయోగించే హక్కు ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌కే సిబ్బంది, ఏఈవో విరూపాక్షి, ఎంపీఈవో నరసింహ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## శనగలో అధిక దిగుబడులు సాధించాలి

– రైతులకు సూచనలు తెలియజేసిన శాస్త్రవేత్తలు

**గడివేముల, అక్టోబర్21, ప్రభాతవార్త;** శనగ పంటలో రైతులు రాణించాలని, అధిక దిగుబడులు సాధించాలని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం అధికారులు, శాస్త్రవేత్త రామకృష్ణారావు, ఎస్.నీలిమ, చైతన్య పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం స్థానిక రైతులకు శనగ గిరిజన ఉప ప్రణాళిక కింద ప్రథమశ్రేణి ప్రదర్శన క్షేత్రాల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రదర్శనలో భాగంగా నంద్యాల గ్రామ్ 857 అనే రకం 40 కిలోలు, వేపనూనె లీటర్, క్లోరానిం్ట్రా-నిలిప్రోల్ 60 మి.లీ., హెక్సాకొనజోల్ 500 మి.లీ. మరియు 1 టార్పాలిన్ పట్టాను గడివేముల మండలంలోని ఎల్.కె.తండాకు చెందిన రైతులకు డా.ఎం.జాన్సన్, సహ పరిశోధనా సంచాకుల ఆధ్వర్యంలో అందించారు. మొదటగా శనగలో అధిక దిగుబడికి తక్కువ పెట్టుడికి సంబంధించి తగు సూచనలు, సలహాలు తెలియజేశారు. రైతులకు వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందిస్తారన్నారు. వ్యవసాయ అధికారుల సలహాలను పాటించి అధిక దిగుబడులు సాధించాలని పిలుపునిచ్చారు.

## యాగంటి శ్రీ ఉమామహేశ్వరస్వామి అమ్మవార్లకు పల్లకి సేవ



**బనగానపల్లె, అక్టోబర్21, ప్రభాతవార్త:** బనగానపల్లె మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి శ్రీ ఉమామహేశ్వరస్వామి అమ్మవార్లకు సోమవారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శాస్త్రోక్తంగా మరియు వైభవోపేతంగా పల్లకి మహోత్సవం నిర్వహించారు. ఈ మేరకు ప్రదోషకాల ప్రత్యేక పూజల అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను అందంగా అలంకరించి పల్లకి నందు కూర్చుండజేసి నందిమండపంలో వేంచేపుచేసి ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ప్రాంగణంలో పల్లకి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పల్లకి సేవ అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను భక్తులకు అర్చకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి బి.చంద్రుడు, పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి, ఆలయ అర్చకులు మహేష్ శర్మ, సత్యనారాయణ శర్మ, లోకనాథ్ శర్మ, చిన్నా, దేవుడు, రాఘవేంద్ర శర్మ, ప్రవీణ్ శర్మ, ఆలయ సిబ్బంది రమేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పన్నులు చెల్లించి అభివృద్ధికి పాటుపడండి

–నగర పాలక కమిషనర్ ఎస్ రవీంద్రబాబు



**కర్నూలు మున్సివల్, అక్టోబర్ 21, ప్రభాతవార్త:** నగరపాలకకు సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధికి పాటుపడాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్ రవీంద్రబాబు ప్రజలను కోరారు. ఈనెల 17 నుంచి రెవిన్యూ విభాగం చేపట్టిన స్పెషల్ డ్రైవ్ ద్వారా రూ.94,43,000 లక్షల పన్నులను రెవిన్యూ విభాగం అధికారులు వసూలు చేశారు. అధికారులు ఆ వివరాలను అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణతో కలిసి కమిషనర్‌కు అందజేశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరాభివృద్ధిలో పన్నులు ఎంతో కీలకమని దీనిని గ్రహించి ప్రజలు స్వచ్ఛందంగా సహకరించడం సంతోషకరమన్నారు. ఈనెల 17 నుంచి 20వ తేది వరకు అస్తిపన్నులు, రూ.89,25,000లు నీటి పన్నులు రూ.5,28,000లు మొత్తం రూ.94.53 లక్షల పన్నులు ఇటీవలే నియమితులైన నూతన సిబ్బంది వసూలు చేయడం హర్షించదగ్గవిషమన్నారు. పన్నుల వసులులో నగరపాలక వృద్ధి సాధిస్తుందని నగరాభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేస్తామన్నారు. ఇంకా పన్నులు చెల్లించని వారు సంబంధిత సచివాలయాల ద్వారా త్వరగా చెలి ంచాలని కమిషనర్ కోరారు. అనంతరం ఆర్‌ఓలు జునైద్, ఇశ్రాయేలు, ఆర్ఐఓలు ఎన్ శేషాద్రి, ఎం రాజు, ఎస్ తిప్పన్న, పి భార్గవ, ఎం నాగరాజులను కమిషనర్, అదనపు కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు.

## సృష్టిలో ప్రథమ దైవగ్రంథం భగవద్గీత అని అందరు తెలుసుకోవాలి

**కర్నూలు విద్య, అక్టోబర్ 21, ప్రభాతవార్త:** సృష్టిలో ప్రథమ దైవగ్రంథం భగవద్గీత అని అందరు తెలుసుకోవాలని ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు అన్నారు. కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీత మరియు వంద అనుబంధ గ్రంథాలను పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర ్బంగా వారు ఇందూ జ్ఞానవేదిక సభ్యులు మాట్లాడుతూ దా ్వపరయుగంలో శ్రీకృష్ణ భగవానుడు యుద్దరంగంలో మొట్టమొదటి రోజు అర్జునునికి భగవద్గీత జ్ఞానాన్ని తెలిపారు. ఈసందర ్బంగా భగవంతుడు తెలుపుతూ ఈజ్ఞానం సృష్టి ఆదిలో సూర్యునికి చెప్పియుంటిని సూర్యుడు మనువుకు చెప్పాడు. మనువు ఇక్ష్వాకుడనే రాజుకు చెప్పారు. రాజు రాజ ప్రజలందరికి చెప్పారు. ఈవిధంగా ప్రపంచ వ్యాప్తంగా ఏ మతం లేని కాలంలో భగవద్గీత జ్ఞానం తెలియజేయబడింది. భూమి పుట్టిన కొద్ది నెలలకే భగవద్గీత జ్ఞానం తెలియజేయబడి కొన్ని సంవత ్సరాలకే ప్రపంచవ్యాప్తంగా భగవద్గీత జ్ఞానం ఉండేది. రాను రాను అధర్మాలు పెరిగిపోయి భగవద్గీత జ్ఞానాన్ని మరిచిపోయారు. అదేవిషయాన్ని శ్రీకృష్ణపరమాత్ముడు ద్వాపరయుగంలో అర్జునుడికి చెపుతూ ఇది సృష్టి ఆదిలోని జ్ఞానం ఇప్పుడు నేను మళ్లీ గుర్తుచేస్తున్నా నీకు అని తెలియజేస్తారు. కాబట్టి మొట్టమొదటి ప్రథమ దైవగ్రంథం భగవద్గీత ప్రపంచంలో ఉన్న ప్రతి మానవునికి అవసరం. గీతలో ఉన్న ధర్మాలను ప్రతిఒక్కరు అచరించి శ్రీకృష్ణపరమాత్మలోకి ఐక్యం కావాలని కోరుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంతం ప్రబోధసేవా సమితి ఇందూ జ్ఞానవేదిక కల్లూరు కమిటీ అధ్యక్షుడు, సభ్యులు పురుశోత్తమ్, ఓబులేసు, ఈశ్వరయ్య, హర్షవర్ధన్, మద్దిలేటి, వరలక్ష్మీ, శ్రీదేవి తదితర సభ ్యులు పాల్గొన్నారు.

## సన్న చిన్నకారు రైతులకు అధికదిగుబడి ఇచ్చే విబిఎన్ 8 విత్తనాలు పంపిణి

–ఏవో పవన్ కుమార్

**వెలుగోడు, అక్టోబర్ 21, ప్రభాతవార్త:** వెలుగోడు మండల రైతు సేవా కేంద్రం నందు సన్న చిన్నకారు రైతులకు ఉచితంగా మినుము విత్తనాల మినీకిట్లను ఏవో పవన్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం పంపిణి చేశారు. ఈసందర ్బంగా ఆయన మాట్లాడుతూ సన్న చిన్నకారు రైతులు మొక్కజొన్న, సోయాచిక్కుడు సాగు అనంతరం రబీ సీజన్‌లో మినుము పంట వేసుకోవాలని రైతులకు తెలిపారు. విబిఎన్ 8 అను అధిక దిగుబడి ఇచ్చే కొత్త వంగడాలను రైతులు సాగుచేసుకోవాలని ఒక్కొక్క రైతుకు ఒకబస్తా నాలుగు కేజీల మినీకిట్టును ఉచితంగా ఇస్తున్నట్లు ఏవో తెలిపారు. ఏవో పాటు మాజీ ఎంపిటిసి వీరభద్రుడు వ్యవసాయ విస్తరణ సిబ్బంది నాగమణి పలువురు రైతులు పాల్గొన్నారు.

## పర్యావరణం పట్ల విద్యార్థులకు అవగాహన



**కర్నూలు విద్య, అక్టోబర్ 21. ప్రభాతవార్త:** 29వ డివిజన్ కస్తూరినగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పర్యావరణం పట్ల అవగాహన కల్పించడానికి సీజ్ బ్రైటర్ ఫౌండేషన్ వారు కార్యక్రమాన్ని ఏర్పాటుచేసి పిల్లలకు ఉచిత పెయింగ్ బుక్స్ మరియు క్రయాన్స్ అందజేయడం జరిగింది. కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ పెరుగు పురుశోత్తమ్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడి వారికి పెయింగ్ బుక్స్ మరియు క్రయాన్స్ అందజేయడం జరిగింది. కార్యక్రమానికి టిడిపి 29వ డివిజన్ ఇంచార్జీ ఎస్‌కే శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమంలో సీజ్ బ్రైటర్ ఫౌండేషన్ తరుపున కె రఘునాథ్, 30 వార్డు ఇంచార్జీ పుల్లయ్య గౌడ్, టిడిపి నాయకులు రామకృష్ణ, వీరు కుమార్, చంద్రమౌళీశ్వరరెడ్డి, జిల్లా పరిషత్ పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ టి శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, దను రమేష్, రాజేష్, బాలరాజు, చిన్న అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు అమర వీరులు త్యాగాలు మరువలేనివి

గోనెగండ్ల అక్టోబరు 21 ప్రభాతవార్త



పోలీసు అమరవీరులు త్యాగాలు మరువలేనివని గోనెగండ్ల సీఐ గంగాధర్ అన్నారు. మండల కేంద్రమైన గోనెగండ్లలో సోమవారం పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామంలోని వీదుల్లో పోలీసులు, ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. దేశం కోసం పోలీసులు చేసిన త్యాగాలను ఈ స ందర ్బంగా వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, మహిళా పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గోనెగండ్లలో నేడు జిల్లా స్థాయి భజన పోటీలు

–నేడు గోనెగండ్లలో చింతలామునిస్వామి మాస పూజలు

గోనెగండ్ల అక్టోబరు 21 ప్రభాతవార్త

మండల కేంద్రమైన గోనెగండ్లలో చింతలాముని, నల్లారెడ్డి స్వాముల వారి మాస పూజలు మంగళవారం జరుగుతున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం రాత్రి దేవాలయ ప్రాంగణం నందు జిల్లా స్థాయి భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ భజన పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి 30 తులాల వెండిని జిల్లా టీడీపీ కార్యదర్శి ప్రభాకర్‌నాయుడు, రెండవ బహుమతి 20తులాలు వెండిని నాగరాజు మిత్రబృందం, మూడవ బహుమతి 15 తులాల వెండి రామకృష్ణ బృందం, అందజేస్తారు. అలాగే నాల్గొ బహుమతి 10 తులాల వెండి. ఐదవ బహుమతి 8 తులాల వెండి, ఆరో బహుమతి 5,1/2 తులాల వెండి, ఏడవ బహుమతి 5తులాల వెండి, ఎనిమిదవ బహుమతి 2.1/2 తులాల వెండి, తొమ్మిదవ బహుమతి 2తులాల వెండి, ఇస్తున్నట్లు తెలిపారు. పోత్సాహక బహుమతులు కూడా ఇస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే వారు రూ.500 ప్రవేశ రుసుము చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని ఇతర వివరాలకు 9912050356, 9885637504లను సం ప్రదించాలని కోరారు.

## మాజీ ఎంపీపీ చొరవతో కదిలిన అధికారులు

10.బొల్లవరం గోకులం షెడ్ పరిశీలన




**నందికొట్కూరుటౌన్, అక్టోబర్ 21, ప్రభాతవార్త :** మండలంలోని 10.బొల్లవరం గ్రామంలో 2019లో సుమారు 21 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన గోకులం షెడ్ రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీపీ వీరం ప్రసాదరెడ్డి చొరవ తీసుకుని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు సోమవారం ఎంపిడిఓ సుబ్రహ్మణ్యం శర్మ, ఎన్ఆర్‌ఈజీఎస్ ఎపిడి అన్వరబేగం, ఎపిఓ అలివేలు, పశుసంవర్ధక శాఖ ఏడి వర ప్రసాద్ మరికొందరు అధికారులు గోకులం షెడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హయాంలో గోవులను పోషించే రైతాంగం కోసం గ్రామ శివారులో 20 గోవులకు సుమారు రూ.21లక్షలతో గోకులం షెడ్ నిర్మాణం జరిగిందన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ గోకులంను పట్టించుకోకపోవడంతో గోకులంలో పిచ్చి మొక్కలు పెరిగి ఎందుకూ పనికిరాకుండా పోయిందన్నారు. ఎంతో వ్యయంతో నిర్మించిన ఈ గోకులం షెడ్ రైతులకు అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లగా కొందరు అధికారులు అప్పటి నిబంధనలు, ఇప్పటి నిబంధనలు మారాయని, ఈ అంశంపై తమ శాఖకు సంబంధించినది కాదని ఒకరిపై ఒకరు చెప్పుకుంటుండడంతో చేసేది లేక తాను ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లానన్నారు. దీంతో అధికారులు గోకులంను సందర్శించారని, ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే గోకులంను సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ప్రసాదరెడ్డి కోరారు.

## విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

**వెలుగోడు, అక్టోబర్ 21, ప్రభాతవార్త:** వెలుగోడు మండలంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని వెలుగోడు మండల విద్యార్థి యువజన సంఘాల జేఏసి నాయకులు శివశంకర్, ఎన్ కిశోర్, ఎం గణేష్‌లు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వెలుగోడు మండలంలోని ఎయిడెడ్ డిగ్రీ, జూనియర్ కళాశాలను ప్రైవేట్ పరం చేసి పేద మధ్యతరగతి విద్యార్థులకు విద్యను దూరం చేశారని వెలుగోడు మండల పరిధిలో ఉన్న విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడానికి ఇతర ప్రాంతాలకు వలసపోవాల్సి దుస్థితి ఏర్పడిందన్నారు. గతంలో జూనియర్ డిగ్రీ కళాశాలలో ఎయిడెడ్‌లో ఉండి ఎంతో మంది విద్యార్థులు ఉన్నత చదువులకు బాటలు వేశాయని అయితే గత వైసీపీ ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేసి పేద విద్యార్థులకు విద్యను అందని ద్రాక్షగా మార్చిందని ప్రస్తుతం అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం స్పందించి కళాశాలను ప్రభుత్వ పరం చేసి మండల విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవడానికి బాటలు వేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కస్తూర్బా స్కూల్‌కు అసంపూర్తిగా ఉన్న కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని తక్షణమే పూర్తిచేయాలని వెలుగోడు మండలంలోని మోడల్ స్కూల్‌కు కస్తూర్బా స్కూల్‌కు సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

## రాష్ట్ర కళాకారిని మంగాదేవికి ఘనసన్మానం

**కర్నూలు హాస్పిటల్, అక్టోబర్ 21, ప్రభాతవార్త:** రాష్ట్ర కళాకారిని మంగాదేవిని హనుమాన్ కళాసమితి అధ్యక్షులు పి హనుమంతరావు చౌదరి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా హనుమంతరావు చౌదరి మాట్లాడుతూ రాష్ట్ర అఖీల ప్రజా కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కె మంగాదేవి హరిచంద్రపాత్రదారుగా పౌరాణిక నాటకంలో మగపాత్రలు నటించడంలో గొప్ప ప్రావీణ్యం గల వ్యక్తి. శ్రీరాముడిగా, అర్జునుడిగా హరిచంద్రగా పాత్రలు ధరించడంలో దిట్ట. ఇప్పటికే వందల నాటకాలను నటించడం జరిగింది. ఈమె మన్యం జిల్లా పార్వతీపురంకు చెందిన గొప్ప కళాకారుని నాటకాలు అడడమే కాకుండా కళారంగానికి కళాకారులకు సేవలు చేయాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులతో స్థాపించి తనవంతు సేవలో కల రంగానికి అందించడం జరుగుతున్నదన్నారు. ఈకార్యక్రమంలో అఖీల ప్రజా కళాకారుల సంఘం రాష్ట్ర వైస్ ప్రసిడెంట్ సంకుల మహాలింగప్ప, బైలుప్పల షఫి వుల్లా, వివి రమణాచారిలు పాల్గొన్నారు.

## కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలి

– అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి కె.బాబు

**ఆదోనిలీగల్, అక్టోబర్21, ప్రభాతవార్త;** విద్యార్థులు కష్టపడికాకుండా ఇష్టపడి చదివినప్పుడే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు చేరుకుంటారని సాంఘిక సంక్షేమశాఖ అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి కె.బాబు సూచించారు. సోమవారం పట్టణంలోని ఎమ్మిగనూరు సర్కిల్ సమీపంలోని ఎస్సీ నంబర్ వన్ బాలుర వసతి గృహాన్ని ఆయన సందర్శించి విద్యార్థులతో ముఖాముఖీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో చదువు ఎంతో విలువైనదన్నారు. కోట్ల ఆస్తుల కన్నా చదువు మన ఊపిరి ఉన్నంతవరకు తరగని ఆస్తిగా ఉంటుందన్నారు. విద్యలేని వారు ఎంతోమంది చెమటలు కార్చి వారి కుటుంబాలను పోషించుకుంటున్నారని గుర్తు చేశారు. పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ఎన్నో కోట్లు ఖర్చు పెట్టి విద్యాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. జన్మనిచ్చిన తల్లిదండ్రుల కోసం కష్టపడి చదివి ఇష్టంతో బంగారు భవిష్యత్‌ను చేరుకోవాలని గుర్తు చేశారు. వివిధ రకాల సబ్జెక్టుల్లో ఏవైనా సమస్యలు ఉంటే హెచ్‌డబ్ల్యూఓను సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. ఉపాధ్యాయులు బోధించే సబ్జెక్టులను శ్రద్ధతో విని, వాటిని తిరిగి నెమరు వేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ అధికారి సిద్ధప్ప, సిబ్బంది రామయ్య, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమంత్‌తాత 34వ ఆరాధన ఉత్సవాలు

వెల్దుర్తి, అక్టోబర్21, ప్రభాతవార్త



మండలంలోని బొమ్మిరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం హనుమంత్‌తాత 34వ ఆరాధన మహోత్సవాలు అశేషభక్త జనుల నడుమ వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలుచేశారు. మహానైవేద్యం హారతి అనంతరం భక్తులందరికి అన్నదానం ఏర్పాటుచేశారు. రాత్రి నందికోల, భజనలు భజనబృందం సభ్యుల ఆధ్వర్యంలో చేపట్టారు. మరుసటిరోజు ఉదయం వరకు అఖండ భజనల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తబృందం సభ్యులు లక్ష్మీరెడ్డి, పామయ్య, రామాంజనేయులు, రాముఆచారి, శివ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులు కల్పించకపోతే చర్యలు తప్పవు

**కొత్తపల్లి, అక్టోబర్ 21, ప్రభాతవార్త:** ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించకపోతే శాఖపరమైన చర్యలు తప్పవని ఎంపీడీఓ మేరీ హెచ్చరించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఎన్ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర ్బంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి రోజు 100 మంది కూలీలకు తగ్గకుండా పనులు కల్పించాలని అదేశించారు. పనులు కల్పించలేని వారు స్వచ్ఛందంగా తప్పుకోవాలని హెచ్చరించారు. ముందుగానే కొత్త పనుల గురించి ఉంచుకోవాలన్నారు. ఈనెల 31న గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తారని కొత్త పనులకు ఎస్టిమేషన్ వేసి గ్రామ సభల్లో సభ తీర్మాణం పొందాలని సూచించారు. పనులు కల్పించడంలో ఏవరైనా ఆలసత్వం వహిస్తే సహించబోమని హెచ్చరించారు. వారికి నోటీసులు ఇస్తామని చెప్పారు. అందరు కలిసి కట్టుగా శ్రమించి ఉపాధిహామి పనులు కల్పించడంలో జిల్లాలో మండలాన్ని మొదటిస్థానంలో ఉంచేందుకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీ పనులను పున: ప్రారంభించాలి

– జాయింట్ కలెక్టర్‌కు విన్నవించిన నాయకులు

**ఆదోనిలీగల్, అక్టోబర్21, ప్రభాతవార్త;** ఆదోనిలో మెడికల్ కాలేజీ పనులు పున: ప్రారంభించలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం లో జాయింట్ కలెక్టర్ నవ్యకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణ, ఖాజా మాట్లాడుతూ అర్థాంతరంగా నిలిచిపోయిన ఆదోని మెడికల్ కాలేజీ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. గత ప్రభుత్వం మెడికల్ కాలేజీలో సిబ్బంది నియామకాన్ని కూడా చేపట్టిందని, మెడికల్ సీట్లు వస్తాయన్న ఆశతో పేద విద్యార్థులు లక్షలు ఖర్చు చేసి కోచింగ్‌లు కూడా తీసుకోవడం జరిగిందన్నారు. అలాగే పశ్చిమ ప్రాంతంలో ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లేలోపే ప్రాణాలు పోయే పరిస్థితి నెలకొందన్నారు. విద్యార్థులకు వైద్య విద్య, సరైన వైద్యం అందాలంటే తక్షణమే ఆదోని మెడికల్ కాలేజీని ప్రారంభించి పూర్తి చేయాలని కోరారు. నాయకులు నాగరాజు, సుభాన్‌బాషా, నరసన్న తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పోలీసుల అమరవీరుల దినోత్సవం

**బండిఆత్మకూరు, అక్టోబర్ 21, ప్రభాతవార్త:** పోలీసు అమరవీరుల దినోత ్సవాన్ని సోమవారం బండిఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో ఘనంగా జరుపుకున్నారు. ప్రాణాలు సైతం లెక్కచేయకుండా విధుల్లో అసువులు బాసిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ముందుగా అమరవీరుల స్థూపచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ జగన్‌మోహన్ మాట్లాడుతూ పోలీసులు ప్రజా రక్షణ కోసం ప్రాణాలు సైతం లెక్కచేయరన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు రక్షణ కల్పించడంలో పోలీసులు తమ ప్రాణాలను పణంగా పెడుతున్నారన్నారు. అమరులైన పోలీసుల అసయ సాధన కోసం కృషిచేయాలని, పోలీసులు దేశానికి వెన్నెముకలాంటి వారన్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ అక్బర్, బండిఆత్మకూరు పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

## వెల్దుర్తిలో ఘనంగా అమరవీరుల సంస్మరణ దినత్సోవం

– పట్టణ పురవీధుల్లో అమరవీరులను స్మరిస్తూ విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టిన పోలీసులు..

వెల్దుర్తి, అక్టోబర్21, ప్రభాతవార్త



మండల కేంద్రమైన వెల్దుర్తిలో సోమవారం అమరవీరుల సంస్మరణ దినోత్సవం వెల్దుర్తి, క్రిష్ణగిరి ఎస్ఐలు అశోక్, మల్లికార్జున ల ఆధ్వర్యంలో నిర్వ హించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి పాత బస్టాండ్‌లోని తెలుగుతల్లి విగ్రహం వద్దకు విద్యార్థులతో కలిసి పోలీసులు చేపట్టిన ర్యాలీ చేరుకుంది. అమరవీరుల ఆత్మశాంతికి ఎస్ఐల ఆధ్వర్యంలో సిబ్బంది, విద్యార్థులు 2 నిమిషాలు మౌనం పాటించారు. సంఘవిద్రోహ శక్తుల చేతిలో దేశం కోసం, దేశ ప్రజల మేలుకై ప్రాణాలర్పించిన అమరవీరులను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని ఎస్ఐలు అశోక్, మల్లికార్జునలు ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజల శాంతి భద్రతల పరిరక్షణకై ముందుండి పాటుపడేది పోలీసులే అన్నారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

– ట్రాన్స్ ఫార్మర్‌కు కనెక్షన్ ఇవ్వకపోవడంతో లబోదిబోమంటున్న రైతు

కొలిమిగుండ్ల, అక్టోబర్21, ప్రభాతవార్త:



కొలిమిగుండ్ల మండల పరిధిలోని అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ అధికారులు కనెక్షన్ ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో సంబంధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన మురళీ అనే రైతు మూడు ఎకరాలలో అరటితోట సాగు చేసుకుంటున్నాడు. అయితే రైతు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ 20 రోజుల కిందట కాలిపోయింది. ఈ మేరకు రైతు పొలంలో సంబంధిత అధికారులు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకువచ్చి దిమ్మె మీద పెట్టి అలానే వదిలేశారని ఇంత వరకు డీపీకి కనెక్షన్ ఇవ్వలేదని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పక్కనున్న రైతుతో కరెంట్ కనెక్షన్ తీసుకుని తన అరటి తోటకు నీళ్లు పెట్టుకుంటూ పంటను కాపాడుకుంటున్నానని రైతు తెలియజేశారు. ఇప్పటికైనా విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇచ్చి అరటి పంటను ఆదుకోవాలని రైతు కోరుతున్నారు.

# క్రీడల ప్రోత్సాహానికి స్పోర్ట్స్‌క్లబ్ ఆదర్శం

: విద్యతో పాటు క్రీడాకారులకు ప్రోత్సాహకం అందించే యువ కెరటం
: ఎంతో మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, మహిళలకు శిక్షణ కార్యక్రమాలు
: ఆత్మకూరు స్పోర్ట్స్‌క్లబ్ ఆధ్వర్యంలో క్రీడారంగంలో ముందుకు
: టిడిపి నియోజకవర్గం తెలుగుయువత ప్రధాన కార్యదర్శి స్పోర్ట్స్‌క్లబ్ చైర్మన్ ఫస్పిల్ మున్నా
: శ్రీశైలం నియోజకవర్గం ఎంఎల్ఏ ఆశీస్సులతో క్రీడాపోటీలు



**ఆత్మకూరు, అక్టోబర్21, ప్రభాతవార్త:** విద్యార్థులకు ఉత్సహం అందిస్తూ క్రీడా రంగంలో క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ప్రోత్సాహన్ని నింపి క్రీడా రంగంలో జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తూ క్రీడాకారులకు అన్ని విదాలుగా అండగా నిలచిన ఆత్మకూరు స్పోర్ట్స్‌క్లబ్ క్రీడాకారులపై అందించిన సేవలు, నిరుద్యోగులకు ఎంతో మంది యువతి, యువకులకు ఉపాధి అవకాశాలు మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి నేడు స్పోర్ట్స్‌క్లబ్ రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలచింది. స్పోర్ట్ స్‌క్లబ్ అందిస్తున్న సేవ కార్యక్రమాలపై పాఠకులకు ప్రత్యేక కథనం.. 2012 సంవత్సరంలో వాలీబాల్ క్రీడలుగా గుర్తింపు తెచ్చుకోని వాలీబాల్‌తో పాటు ఇతర క్రీడలను ప్రోత్సాహించాలనే ఉత్సహంతో స్పోర్ట్స్‌క్లబ్ చైర్మన్ టిడిపి తెలుగు యువత శ్రీశైలం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి పస్పిల్‌మున్నా క్రీడాకారులకు 11రకాల క్రీడలను నిర్వహించడం విశేషం. క్రీడలో ఎంతో మంది ఉత్సహం నింపుతూ గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయిలో ముందుకు వెళ్లాలనే ఆశయం, పట్టుదలతో ఎన్నో సేవ కార్యక్రమాలు చేపడుతు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలోనే క్రీడా రంగాన్ని మరింత అభివృద్ధి చేసే విదంగా స్పోర్ట్స్‌క్లబ్‌ను ఏర్పాటు చేసి క్రీడాకారులో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీస్తూ జాతీయ స్థాయిలో గోల్డుమెడల్ సాదించిన విజయాలు స్పోర్ట్స్‌క్లబ్ దక్కిందని చెప్పవచ్చు. మరోవైపు మహిళ క్రీడాకారులకు మొట్టమొదటి సారిగా వాలీబాల్ క్రీడలు నిర్వహించి మరోసారి స్పోర్ట్స్‌క్లబ్ సత్తా చూపించారు. గత 12 సంవత్సరాల నుంచి నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరు పట్టణంలో స్పోర్ట్స్‌క్లబ్ ఆద్వర్యంలో క్రికెట్, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ ఎన్నో క్రీడలను నిర్వహిస్తునే ఉన్నారు. క్రీడాకారులకు ఉత్సహం అందించిన స్పోర్ట్స్‌క్లబ్ నిర్వహకులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలు, సన్మాన కార్యక్రమాలు జరిగిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆత్మకూరు పర్యటనలో భాగంగా స్పోర్ట్స్‌క్లబ్ ఆద్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ క్రీడలను ప్రారంభించిన సందర్భాలు మరెన్నో ఉన్నాయి. శ్రీశైలం నియోజకవర్గం ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి ఆశీస్సులతో స్పోర్ట్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగే క్రీడలను ప్రోత్సాహిస్తూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్న స్పోర్ట్స్‌క్లబ్ సేవలను ఎన్నో సార్లు ప్రశంసలు కురిపించారు. నేటి యువతారికి క్రీడలు నిర్వహించి గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయిలో క్రీడాకారులకు ప్రత్యేక గుర్తింపు తీసుకరావాలనే ఆశయంతోనే స్పోర్ట్స్‌క్లబ్ సేవలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతం చేస్తూ టిడిపి తెలుగు యువత ప్రధాన కార్యదర్శి స్పోర్ట్స్‌క్లబ్ చైర్మన్ పస్పిల్‌మున్నా ఇటివలే కాలంలో రాష్ట్ర స్పోర్ట్స్‌క్లబ్ చైర్మన్‌ను కలసి తమ సేవలపై చైర్మన్ దృష్టికి తీసుకెళ్లిన్నట్లు సమాచారం. ఏదిఏమైన్నప్పటికి రాష్ట్ర వ్యాప్తంగా క్రీడాకారులకు మంచి ప్రోత్సాహంను అందిస్తూ అన్ని రంగాలలో





క్రీడాకారులకు చేయూతను అందిస్తూ దాతల సహకారంతో ముందుకు వెళ్తున్న స్పోర్ట్స్‌క్లబ్ సేవలు మరింత మెరుగు పరిచే విదంగా క్రీడలను కొనసాగిస్తున్నారు.

## హాస్టల్ దగ్గర నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలి..!

:- డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైన,ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు ఉమేష్

**ఆలూరు, అక్టోబరు 21,ప్రభాతవార్త**

బిసి బాయ్స్ హాస్టల్ మరియు బిసి మేనేజ్‌మెంట్ కళాశాల బాయ్స్ హాస్టల్ దగ్గర నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైన,ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు ఉమేష్,మహిళా సంఘం మండల అధ్యక్షురాలు శేకన్‌బీలు డిమాండ్ చేశారు. సోమవారం డివైఎఫ్ఐ,ఎస్ఎఫ్ఐ ఆద్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు డివైఎఫ్ఐ మండల అధ్యక్షుడు గోవర్ధన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన ఆలూరులో అరికెర రోడ్డులో ఉన్నటువంటి బిసి బాయ్స్ హాస్టల్‌లో ఆరవ తరగతి నుండి 10వ తరగతి వరకు 100మందికిపైగా విద్యార్థులున్నారని,బిసి మేనేజ్‌మెంట్ కళాశాల బాయ్స్ హాస్టల్‌లో ఇంటర్,డిగ్రీ,ఐటిఐ,పాలిటెక్నిక్ కళాశాలలో పేద,మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులు వసతి పొందుతూ విద్యనభ్యసిస్తున్నారని అన్నారు. అయితే ఈ హాస్టల్ దగ్గర నూతనంగా మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని దీంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. అంతేకాక ప్రభుత్వం బడి,గుడి దగ్గర మద్యం దుకాణాలు ఏర్పాటు చేయకూడదని నిబంధనలో ఉన్నా నిబంధనలు అతిక్రమించి మద్యం దుకాణం ఏర్పాటు చేయడం సరైంది కాదన్నారు. ఒక పక్క ప్రభుత్వం,అధికారులు కళాశాల,పాఠశాలలో మద్యం,మత్తు పదార్థాల పట్ల అవగాహన కల్పిస్తూ సెమినార్లు నిర్వహిస్తుంటే మరోపక్క విద్యాసంస్థల పక్కనే మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో మద్యంకు అలవాటు పడి బానిసలు అవ్వండి అంటూ ప్రోత్సహించి వారి జీవితాలను నాశనం చేసేవిధంగా ఉందన్నారు. వెంటనే వసతి గృహాల పరిధిలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మాజీ తాలుక ఇంచార్జ లక్ష్మీనారాయణ,సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి నారాయణస్వామి,రైతుసంఘం మండల కార్యదర్శి ఈరన్న,సిఐటియు నాయకులు కృష్ణలు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం ఐద్వా నాయకురాలు గౌసియా,డివైఎఫ్ఐ,ఎస్ఎఫ్ఐ నాయకులు మహేష్,బసవరాజు,చంద్ర,బోటయ్య,తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతోనే ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం

:- తహశీల్దార్ నాగరాజు



**తుగ్గలి, అక్టోబరు 21,ప్రభాతవార్త :** ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలు తినడం వల్ల ప్రతి మనిషి ఆరోగ్యంగా ఉంటారని తుగ్గలి తహశీల్దార్ నాగరాజు పేర్కొన్నారు. సోమవారం ప్రకృతి వ్యవసాయ అధికారులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం నందు ప్రకృతి వ్యవసాయంతో పండించిన వివిధ రకాల కూరగాయల ఉత్పత్తుల స్టాల్‌ను ఏర్పాటు చేసి వాటివల్ల ఆరోగ్యానికి కలిగే లాభాలను వివరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ నాగరాజు మాట్లాడుతూ ప్రజలందరు ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఆకుకూరలు,గడ్డి జాతి,తీగ జాతి కూరగాయలను భుజించడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పంట సాగునకు ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. క్రిమిసంహారక మందులతో పండించే పంటల ద్వారా మానవాళికి ముప్పు ఏర్పడుతుందని అన్నారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ అధికారులు చెప్పిన విధంగా ఆచరించి ప్రకృతి వ్యవసాయంతో కూరగాయలు పండించేందుకు పాటుపడాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయంలో తహశీల్దార్ నాగరాజు,తుగ్గలి ఎస్ఐ కృష్ణమూర్తితో పాటు రెవెన్యూ సిబ్బంది ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఉత్పత్తులను కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అధికారులు ఎల్1 లింగప్ప,ఐసిఆర్‌పిలు రవి,భాస్కర్,రాముడుతో పాటు రైతులు,ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎన్నికైన క్రీడాకారులు

**పెద్దకడుబూరు, అక్టోబరు 21,ప్రభాతవార్త**

సెప్టెంబరు నెల 6వ తేదీన కర్నూలు జిల్లా డిఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియంలో జరిగిన అథ్లెటిక్ సెలక్షన్‌లో అండర్-14,16,18,20లో బాలబాలికల విభాగంలో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎన్నికైనటువంటి క్రీడాకారులు ఈ నెల అక్టోబరు 4,5,6వ తేదీల్లో రాజమండ్రిలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలలో పాల్గొంటారని అథ్లెటిక్స్ కార్యదర్శి సి సుబ్బరత్నాలు సోమవారం విలేకర్లకు తెలిపారు. కావున జిల్లాస్థాయిలో ప్రథమ,ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎన్నికైన క్రీడాకారులు ఈ నెల 3వ తేదీన సాయంత్రం 5గంటలకు డోన్ రైల్వే స్టేషన్‌లో రిపోర్టు చేయాలని తెలిపారు. మరింత సమాచారం కొరకు 9493323964,8919409232లను సంప్రదించాలన్నారు.

## 23న పగిడ్యాల మండల సర్వసభ్యసమావేశము

- ఎంపిడిఓ సుమిత్రమ్మ

**పగిడ్యాల, అక్టోబరు 21,ప్రభాతవార్త :** స్థానిక మండల పరిషత్ సమావేశభవనంలోఈ నెల 23వ తేదీన ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్యసమావేశము నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారిశ్రీమతి సుమిత్రమ్మ సోమవారం తెలిపారు.ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి మాట్లాడుతూ మండల సర్వసభ్యసమావేశానికి జెడ్పీటిసి, ఎంపిపి, కో-ఆప్షన్ మెంబరు, ఎంపిటిసిలు, మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన అభివృద్ధి నివేదికలను మండల అభివృది కార్యాలయంలో అందజేయాలన్నారు.మండల సర్వసభ్యసమావేశానికి హాజరుకాని అధికారుల జాబితాను తయారు చేసి తగు చర్యల నిమిత్తం నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం పంపడం జరుగుతుందనీ మండల అభివద్ధి అధికారి శ్రీమతి సుమిత్రమ్మ తెలిపారు.

## విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలి

:- డిఎస్పీ వెంకటరామయ్య



**పత్తికొండ, అక్టోబరు 21, ప్రభాతవార్త :** సమాజం శాంతియుతంగా కొనసాగాలంటే పోలీసులు తమ విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేయాలని డిఎస్పీ వెంకటరామయ్య అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమం సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు భ్రమరాంబ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డిఎస్పీ వెంకటరామయ్యతో పాటు ట్రైనీ డిఎస్పీ ఉషశ్రీ,సిఐ జయన్నలు హాజరయ్యారు. ముందుగా పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సభనుద్దేశించి డిఎస్పీ వెంకటరామయ్య మాట్లాడుతూ కొన్ని సందర్భాలలో పోలీసులు తమ విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి విధులను నిర్వర్తించడం వలన ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందన్నారు. అలాంటి వీర పోలీసు జవాన్లకు ప్రతి ఏడాది అక్టోబరు 21న సంస్మరిస్తూ నివాళులర్పిస్తుంటారన్నారు. అలాగే తన విధి నిర్వహణలో ఎదుర్కొన్న ఇబ్బందులను,సంఘటనలను సోదాహరణంగా వివరించారు. అమ్మాయిలు టీనేజ్‌లో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు జరుగుతున్నాయని వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మీ లక్ష్యం,ఆశయం మీరు మరిచిపోకూడదన్నారు. మీ జీవితం మీ చేతుల్లో ఉందన్నారు. పాఠశాలలో అమ్మాయిలకు పోలీసులు సమాజ భద్రత అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సత్యనారాయణ,రాజశేఖర్,ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోళ్ళబావాపురంలో భారీగా బెల్లం ఊట ధ్వంసం



**నందికొట్కూరు, అక్టోబర్ 21,ప్రభాతవార్త:** మండల పరిధిలోని కోళ్ళబావాపురం గ్రామంలో నాటుసారా తయారికి భారీగా సిద్ధం చేసిన బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లుగా సి.ఐ.రామాంజనేయులు తెలిపారు. సోమవారం నంద్యాల జిల్లా ఎక్సైజ్ అధికారుల ఆదేశాల మేరకు నందికొట్కూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ ఎస్సై జఫ్రుల్లా ఆధ్వర్యంలో దాడులు చేసి 1000 లీటర్ల బెల్లం ఊటను ధక్వంసం చేసినట్లుగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పద్మనాభం,శివన్న, సుధీర్, మధు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ మద్యం పట్టివేత



**జూపాడుబంగ్లా, అక్టోబర్ 21,ప్రభాతవార్త:** మండల పరిధిలోని తంగడంచ గ్రామంలో నల్లపోతుల అయ్యన్న అనే వ్యక్తి వద్ద తెలంగాణ రాష్ట్రానిరి చెందిన 10 మద్యం బాటిళ్ళను స్వాదీనం చేసుకున్నట్లుగా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ ఎస్సై జఫ్రుల్లా తెలిపారు.కేసు నమోదు చేసినట్లుగా ఆయన తెలిపారు.

## సమాచార హక్కు చట్టంపై అవగాహన

**చిప్పగిరి, అక్టోబరు 21,ప్రభాతవార్త**

సమాచార హక్కు చట్టంపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని చిప్పగిరి వ్యవసాయ అధికారి జయలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన చిప్పగిరి వ్యవసాయ కార్యాలయంలో ఆర్‌బికె సిబ్బంది,వ్యవసాయ కార్యాలయ సిబ్బంది,గ్రామ రైతులతో కలిసి సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి జయలక్ష్మి మాట్లాడుతూ 2005 వన్‌బి ప్రకారం సమాచార హక్కు ఎవరైనా ప్రభుత్వ కార్యాలయంలో అడిగితే అడిగిన 30రోజుల లోపల సమాచారాన్ని ఇవ్వాలన్నారు. సమాచారం అడిగే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందన్నారు. 30రోజుల లోపల ఇవ్వకపోతే ఆ శాఖ సంబంధిత పై అధికారికి అపీల్ చేసుకోవచ్చన్నారు. కాబట్టి ప్రతిఒక్క అధికారి సమాచార హక్కు చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండి అడిగిన సమాచారాన్ని ఇచ్చుటకు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది,ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వేరుశనగలో విత్తనశుద్ధి తప్పనిసరి

**దేవనకొండ, అక్టోబరు 21,ప్రభాతవార్త**

వేరుశనగలో విత్తనశుద్ధి తప్పనిసరి అని మండల వ్యవసాయాధికారి సిహెచ్ సురేష్‌బాబు అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఐరనబండ గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. పంట విత్తే ముందు విత్తన శుద్ధి తప్పక చేసుకోవాలని అలాగే వేరుశనగ 15సాల్లకు ఒకసాలు కందిసాల్లు వేసుకోవాలని అలాగే అక్కడక్కడ బంతిపూలు వేసుకోవాలన్నారు. విత్తనశుద్ధికి ట్రైకోడెర్మా విరిడి 50కిలో విత్తనాలకు కేజీ చొప్పున విత్తనశుద్ధి తెగులు రాకుండ సాఫ్ కూడా విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. వేరుశనగ పంటలో పురుగు ఎక్కువగా ఉన్నప్పుడు ఆకుపచ్చ పురుగు మరియు లద్దపురుగు ఎక్కువగా వస్తుందని అందువల్ల దాని నివారణకు క్లోరోపెరి పాస్ 2.5ఎంఎల్ మరియు మోనోపాస్ 2.0ఒక లీటరు నీటిని కలుపుకుని స్ప్రే చేస్తే పురుగు ఉధృతి తగ్గుతుందన్నారు. ఈ విధంగా పంటలో సస్యరక్షణ పద్ధతులు పాటించాలని అలాగే సేంద్రీయ ఎరువులు ఎక్కువగా వాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడు విత్తన ఉత్పత్తి అధికారి చైతన్యకుమార్,వ్యవసాయ విస్తరణ అధికారి వి రంగన్న,విఏఏ నరసప్ప,రంగస్వామి,గ్రామరైతులు పాల్గొన్నారు.

## అనాధ పిల్లలకు ఆపన్న హస్తం

**తుగ్గలి, అక్టోబరు 21,ప్రభాతవార్త :** మండల పరిధిలోని మారెళ్ల గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయిన అనాధలై రోడ్డున పడ్డ పిల్లలకు చుట్టుపక్కల గ్రామాల వారు ఆర్థిక సహాయాన్ని అందచేస్తూ ఆపన్న హస్తాన్ని అందచేస్తున్నారు. వివరాల్లోకి వెళితే పత్తికొండ మండలం చందోలి గ్రామానికి చెందిన లక్ష్మి(35)ని తుగ్గలి మండలంలోని మారెళ్ల గ్రామానికి చెందిన ఆంజనేయకు ఇచ్చి వివాహం చేశారు. అయితే ఆ దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు సంతానం,రెండేళ్ల క్రితం ఆంజనేయ గుండెపోటుతో మృతిచెందారు. అయితే భర్త మృతి అనంతరం ఆమె పిల్లలతో కలిసి పుట్టింటికి చేరుకుంది. పుట్టింటి వద్దనే కూలి పనులు చేసుకుంటూ పిల్లలను కంటికి రెప్పలా చూసుకుంటూ జీవనం కొనసాగిస్తుంది. అయితే ఆదివారం కూలి పనులకు వెళ్లి ఇంటికి వచ్చిన ఆమె అలసటతో కాసేపు సేద తీరుతూ మృత్యువు ఒడిలోకి జారుకుంది. తల్లిదండ్రులు ఇద్దరు తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో ఆ పిల్లల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. దీంతో పిల్లలను చూసి చలించిపోయిన చుట్టుపక్కల గ్రామస్తులు చందోలి వెంకటేశ్వరరెడ్డి రూ.5వేలు,గోవర్ధన్‌రెడ్డి రూ.5వేలు,శ్రీదేవమ్మ సైన్యం,శ్రీకృష్ణ యూత్‌లు రూ.6వేలు,టీం రూ.10వేలు,రంగస్వామి రూ.2,500లు అనాధలైన పిల్లలకు ఆర్థిక సహాయాన్ని అందచేసి అండగా నిలిచారు. అలాగే ప్రతి గ్రామం నుంచి తల్లిదండ్రులను కోల్పోయి తల్లడిల్లుతున్న కనుపాపలకు ఆర్థికంగా అండగా నిలవాలని ఆ గ్రామప్రజలు కోరుతున్నారు. అనాధ పిల్లలకు ఆర్థిక సహాయం అందించేందుకు 9949081540ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మారెళ్ల వాల్మీకి అంజి,హోసూరు రామచంద్ర,మీసేవ రాముడు,దేవర ఇంటి వెంకట్రాముడు,గొల్ల రామయ్య,నొక్క చెన్నకేశవులు,మంగళి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధి ఎమ్మెల్యే తోనే సాధ్యం..!

- కౌన్సిలర్ ఎవి సురేష్



**ఆదోని అర్బన్, అక్టోబరు 21,ప్రభాతవార్త :** ఆదోని నియోజకవర్గ అభివృద్ధి ఎమ్మెల్యే పార్థసారథితోనే సాధ్యమని 2వ వార్డు కౌన్సిలర్ ఎవి సురేష్ అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలో 2వ వార్డు కౌన్సిలర్ ఎవి సురేష్ వైసిపి పార్టీని వీడి ఎమ్మెల్యే పార్థసారథి సమక్షంలో భారతీయ జనతా పార్టీలో చేరారు. పార్టీలో చేరిన కౌన్సిలర్ సురేష్‌కు ఎమ్మెల్యే పార్థసారథి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సురేష్ మాట్లాడుతూ నా వార్డు సమస్యలు చాలా ఉన్నాయని వాటిని పరిష్కరించుకోవాలంటే ఆదోని నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి వలనే సాధ్యమవుతుందన్నారు. అందులో భాగంగానే బిజెపి పార్టీలో చేరానని తెలిపారు. తప్పకుండ నా వార్డు సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సహకారంతో ప్రజల సమస్యలను పరిష్కారం చేసుకుని నా వార్డు అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ,వెల్లాల మధుసూదనశర్మ, సింహం నాగేంద్ర,బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర,ఆదోని నియోజకవర్గ కోకన్వీనర్ నాగరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రజాసమస్యల పరిష్కారవేదిక

**పగిడ్యాల, అక్టోబరు 21,ప్రభాతవార్త :**

మండల కేంద్రమైన పగిడ్యాల తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో మంగళవారం ఉదయం 10గంటలకు ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం ఎంఎల్ఏ గిత్త జయసూర్య ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందనీ మండల అభివృద్ధి అధికారి శ్రీమతి సుమిత్రమ్మ సోమవారం తెలిపారు.ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమానికి మండల స్థాయి ప్రజాప్రతినిధులుమండల స్థాయి అధికారులు, విఆర్ఓలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు హాజరుకావాలన్నారు. అందరు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ మండల అభివృద్ధి అధికారి శ్రీమతి సుమిత్రమ్మ కోరారు.

## ఆరు మందిపై కేసు నమోదు



**ఆదోనిటౌన్, అక్టోబర్21, ప్రభాతవార్త;** తమ ఆస్తిని ఆధార్‌కార్డు ఫోర్జరీ చేసి అక్రమంగా రిజిస్టర్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు రాజశేఖర్, హరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం ఆరు మందిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ సూర్యమోహన్‌రావు తెలిపారు. డెంటల్ డాక్టర్ రవికిరణ్, జె.లక్ష్మి, చిప్పల సురేష్‌బాబు, సాక్షులు చంద్రప్ప, రవికుమార్, డాక్యుమెంట్ రైటర్ రవిలపై 420, 468 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. డెంటల్ డాక్టర్ రవికుమార్ తన తల్లి పేరును ఫోర్జరీ చేసినందుకు, ఫోర్జరీ చేసుకుని అక్రమంగా ఇంకొకరికి రిజిస్టర్ చేసిన జె.లక్ష్మిని, ఆస్తిని అక్రమంగా రిజిస్టర్ చేసుకున్నందుకు చిప్పల సురేష్‌బాబు, అక్రమ రిజిస్టర్ చేసేందుకు ఇద్దరు సాక్షులపై, అక్రమ రిజిస్టర్ చేసేందుకు పాల్పడిన డాక్యుమెంట్ రైటర్‌పై చీటింగ్, ఫోర్జరీ కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## ప్లాట్ రిజిస్ట్రేషన్‌పై తక్షణమే విచారణ చేపట్టాలి

**ఆదోని, అక్టోబరు 21,ప్రభాతవార్త**



పట్టణంలో ఎస్‌కెడి కాలనీ మండగిరి పరిధిలో అక్రమంగా ఒక ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసుకోవడంపై తక్షణమే విచారణ చేపట్టి బాధ్యులకు న్యాయం చేసి నింధితులకు శిక్షణ పడేలా చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ రమేష్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా రమేష్ యాదవ్ మాట్లాడుతూ ఆధార్ కార్డులు మార్ఫింగ్ చేసి విలువైన స్థలాన్ని కొట్టేయాలనే దురుద్దేశ్యంతో ఈ పనికి ఒడిగట్టారన్నారు. ఎమ్మెల్యే పార్థసారథి పర్సనల్ పిఏగా చెప్పుకుంటున్న దంత వైద్యుడు డాక్టర్ రవికిరణ్ కొత్త తరహా మోసాన్ని ఆదోని చరిత్రలో సృష్టించారన్నారు. కబ్జాలకు పాల్పడిన రవికిరణ్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అలాగే అతనికి సహకరించిన సిబ్బందిపై కూడా విచారించి తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ ఉపాధ్యక్షులు దిలీప్‌దోకా,యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతిరావు,పట్టణ మాజీ అధ్యక్షులు సాయినాథ్,యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దేవిశెట్టి వీరేష్,ఎన్ఎస్‌యుఐ నాయకులు శ్రీనిత్,రామకృష్ణారెడ్డి,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## కబ్జాకు పాల్పడిన వారిపై ఫిర్యాదు-కేసు నమోదు

**ఆదోని, అక్టోబరు 21,ప్రభాతవార్త**



ఆదోనిలో సంచలనం రేకెత్తించిన భూకబ్జాదారులపై 2టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదు అయ్యింది. మూడురోజుల క్రితం డెంటిస్ట్ రవికిరణ్ తన ఇంటి పక్కన ఉన్న విలువైన 6సెంట్ల భూమిని ఫోర్జరీ చేసి తన కుటుంబ సభ్యులపై ఆదోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్టర్ చేసుకోగా డిజిటల్ సిగ్నేచర్ దగ్గర బండారం బయట పడిన విషయం విధితమే. సదరు భూ యజమానుల వారసులు కురువ హరీష్‌బాబు,రాజశేఖర్ అసలు విషయం తెలుసుకుని పట్టణ 2టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సిఐ సూర్యమోహనరావుకు వినతిపత్రంతో కూడిన ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు డాక్టర్ రవికిరణ్ తల్లి జక్క లక్ష్మీ,సురేష్‌బాబులతో పాటు డాక్యుమెంట్ రైటర్,సహకరించిన సాక్షులపై ఫోర్జరీ కేసు కింద 420,468కేసులను నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సిఐ సూర్యమోహన్‌రావు తెలిపారు.

## ఉరివేసుకొని వ్యక్తి మృతి



**నందవరం, అక్టోబర్ 21, ప్రభాతవార్తః** భార్య పిల్లలు మద్యం తాగవద్దని మందలించారని ఇంట్లో ఏవరు లేని సమయంలో ఫ్యానుకు తన పంచతో ఉరివేసుకొని వ్యక్తి మృతి చెందారు. వివరాల్లోకి వెళ్లితే మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామానికి చెందిన వడ్డె ఉరుకుంద (50) కుటుంబ పోషణ భారమై భార్య పిల్లతో పాటు బెంగుళూరులో కూలీ పనులు చేస్తు జీవనం సాగించేవారు. సొంత గ్రామానికి దసరా పండుగకు వచ్చి పండుగలో మద్యానికి బాగా బానిస అయ్యారు. గత రెండు రోజుల క్రితం ఆయన స్పందన స్ఫూర్తి ఫైనాన్స్ ప్రైవేట్ బ్యాంకు నందు రూ.40 వేలు లోన్ తీసుకున్నారు. బ్యాంకు లోన్ ఇచ్చిన నగదును సుమారు రూ.20 వేలు మద్యం, చిన్న చిన్న అప్పులను చెల్లించి మిగతా రూ.20 వేలు కుటుంబ సభ్యులకు ఇచ్చారు. మిగిలిన డబ్బు ఎక్కడికి పోయిందని ఆయన భార్య సావిత్రి, కొడుకు అతన్ని మందలించినందుకు మనస్థానం చెంది ఇంట్లో ఫ్యాన్ పక్కన గల ఇనుప హుక్కుకి తన పంచతో ఉరివేసుకొని చనిపోయాడని స్థానిక నందవరం ఎస్ఐ వి శ్రీనివాసులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఉరుకుంద భార్య సావిత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

## దేవనకొండ నుండి ఆదోనికి బస్సు సౌకర్యం కల్పించాలి

- డివిఎంసి మెంబర్ కాకర్ల శాంతికుమార్

**దేవనకొండ, అక్టోబరు 21,ప్రభాతవార్త**

దేవనకొండ నుంచి ఆదోనికి ప్రతిరోజు అప్‌అండ్‌డౌన్ బస్సు సౌకర్యం కల్పించాలని డివిఎంసి మెంబర్ కాకర్ల శాంతికుమార్ అనా న్నరు. సోమవారం కర్నూలు జిల్లా ఏపిఎస్‌ఆర్టీసి రీజనల్ మేనేజర్ టి శ్రీనివాసులును కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అతిపెద్ద మండలం దేవనకొండ మండలం అని మండలంలో 44గ్రామాలు ఉన్నాయని ఇక్కడ హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా సుమారు 40వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. రైతులు ఎక్కువగా పత్తి,వేరుశనగ పంటలు సాగు చేస్తున్నారన్నారు. పంట అమ్మడం కోసం ఆదోని వ్యవసాయ మార్కెట్‌కు అధిక సంఖ్యలో రైతులు వెళుతుంటారని,వ్యాపార అవసరాల నిమిత్తం ప్రజలు మరియు రైతులు పంటతో పాటు రైతులు కూడా ఆటోలో వెళ్తున్నారన్నారు. దేవనకొండ మండలానికి ఆదోని నుంచి సరైన బస్సు సౌకర్యం లేక రైతులు అమ్ముకున్న పంటసొమ్మును భయం గుప్పెట్లో పెట్టుకుని వస్తున్నారన్నారు. అలాగే ఆటోలో ప్రయాణించడం వల్ల ప్రమాదాల బారిన పడి గాయాల పాలవుతున్నారన్నారు. కావున దేవనకొండ నుంచి ఆస్పరి మీదుగా ప్రతిరోజు అప్ అండ్ డౌన్ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు.

## ప్రభుత్వ కార్యాలయం స్థలాన్ని కబ్జా చేస్తున్నా పట్టించుకోని ఏడిఏ



**పత్తికొండ, అక్టోబరు 21,ప్రభాతవార్త :** పట్టణంలోని వ్యవసాయ ఏడిఏ కార్యాలయ గోడౌన్ వెళ్లే స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేస్తున్నా వ్యవసాయ ఏడిఏ పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. తహశీల్దార్ కార్యాలయంలో విఆర్ఓలు ముడుపులు తీసుకుని కబ్జాకు సహకరించారని ఆ కార్యాలయ సిబ్బంది చర్చించుకుంటున్నారు. ఈ విషయం ఏడిఏకు తెలిసినా నిర్లక్ష్యంగా ఉండడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ కాంపౌండ్‌లో కార్యాలయం ఉన్నందుకు రెవెన్యూ అధికారులు వారు ఆడిందే ఆటగా..పాడిందే పాటగా..వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఏ ప్రభుత్వ కార్యాలయంలో స్థలం ఉంటే రెవెన్యూ అధికారులు ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు వినికిడి. విఆర్ఓలు భారీగా ముడుపులు తీసుకుని కబ్జాలకు సహకరిస్తున్నారని పట్టణ ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రభుత్వ కార్యాలయాలు కబ్జాలకు గురికాకుండ కాపాడాలని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.

## పంచాయతీ కార్యదర్శి,ఎంపిడిఓపై డిపిఓకు ఫిర్యాదు

**మంత్రాలయం, అక్టోబర్ 21,ప్రభాతవార్త:** మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేష్,గతంలో ఎంపిడిఓగా విధులు నిర్వహించినవారిపై డిపిఓ భాస్కర్ నాయుడికి ఫిర్యాదు చేసినట్లు సమాచార హక్కుచట్టం జిల్లా లీగల్‌సెల్ కన్వీనర్ జాలవాడి విజయ్ కుమార్ సోమవారం విలేకరులకు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రచ్చుమర్రి గ్రామానికి సంబంధించి 2019-2024 సంవత్సరాలకు గాను గ్రామానికి ప్రభుత్వం ఎన్నినిధులు కేటాయించింది,ఎన్నినిధులు ఖర్చుచేశారు తదితర వివరాలను తెలపాలని సమాచార హక్కుచట్టం ద్వారా అడిగినట్లు పేర్కొన్నారు.అయితే సమాచారం అడిగి 60 రోజుల గడువు పూర్తయినా నేటివరకు సమాచారం ఇవ్వలేదన్నారు.ఇందుకుగాను సమాచారం ఇవ్వలేదని ఆదోని డిఎల్‌పిఓకు మొదటి అప్పీల్ చేశామన్నారు.అక్కడకూడా స్పందించకపోవడంతో పంచాయతీ కార్యదర్శి,ఎంపిడిఓపై డిపిఓకు ఫిర్యాదు చేశామన్నారు.అధికారులకు సమాచాహక్కు చట్టంపై కనీస అవగాహన లేకపోవడంతో సమాచారం ఇవ్వడం లేదన్నారు.కావాలనే సమాచారాన్ని ఇవ్వడంలో ఆలస్యం చేస్తున్న ఇద్దరు అధికారులపై త్వరలోనే సమాచార హక్కుచట్టం కమీషనర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

## నేటి నుండి రెవెన్యూ గ్రామసభలు



**నందికొట్కూరు, అక్టోబర్ 21,ప్రభాతవార్త:** రీ సర్వే పూర్తి అయిన గ్రామాలలో ఈ నెల 22 నుండి నవంబర్ 2వ తేదీ వరకు మండల పరిధిలో జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని తహసిల్దార్ బి.శ్రీనువాసులు తెలిపారు. 22న అల్లూరు, 23న బిజినవేముల, 24న 10.బొల్లవరం, 25న బ్రాహ్మణకొట్కూరు, 26న దామగట్ల, 29న కొణిదేల, 30న మద్దిగట్ల, నవంబర్ 1న శాతనికోట, 2న వడ్డెమాను గ్రామాలలో జరుగుతాయని కావున రీ-సరే ఇవకు సంభంధించిన సమస్యలు ఏమైన ఉంటే గ్రామ సభలలో పాల్గొని అర్జీలు ఇచ్చుకోవాలని ఆయన తెలిపారు.

# పోలీసు అమరుల త్యాగాలు చిరస్మరణీయం - జిల్లా జడ్జి కబర్ధి

**: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం**

**కర్నూలు, అక్టోబర్ 21, ప్రభాతవార్త :** విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ పెరేడ్ మైదానంలో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం లో పోలీసు అమరవీరులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ బిందు మాధవ్, జాయింట్ కలెక్టర్ బి.నవ్య ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రజలకు రక్షణ కల్పిస్తూ ప్రాణాలు కోల్పోయిన పోలీసు అధికారుల ధైర్యసాహసాలు, దేశభక్తి మరియు విధేయతలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుని గౌరవిస్తారన్నారు. దేశ , రాష్ట్ర సరిహద్దు అంతర్గత భద్రత రక్షణలో పోలీసులు ప్రతిరోజూ సవాళ్లను ఎదుర్కొంటు న్నారన్నారు. దేశ భద్రత కోసం పగలు, రాత్రి అనే తేడా లేకుండా విధి నిర్వహణలో ప్రాణాలను ఫణంగా పెడుతూ, ప్రజల ప్రాణాలను కాపాడుతున్నారన్నారు. పోలీసుల త్యాగాలు రాబోయే తరాలకు స్ఫూర్తినిచ్చి దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తుందన్నారు. దేశ , రాష్ట్ర సరిహద్దుల్లో పోలీసులు విధి నిర్వహణలో ప్రాణ త్యాగాలు చేస్తూ ముందుకు పోవడం గర్వకారణమన్నారు.

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులను స్మరించుకుంటూ, నివాళులర్పిస్తూ ఈరోజు పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. దేశవ్యాప్తంగా విధినిర్వహణలో అశువులు బాసిన పోలీసులను స్మరిస్తూ, ప్రతి ఏడాది అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా పాటించడం జరుగుతుందన్నారన్నారు.



జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ 1959 సంవత్సరం అక్టోబరు 21 వ తేదీన భారత్ - చైనా సరిహద్దు లధఖ్లోని హాట్ స్ప్రింగ్ వద్ద పోలీసు పెట్రోలింగ్ పహారాలో ఉన్నటువంటి 10 మంది అఖీఖఈ జవానుల పై శత్రువులు దాడి చేయగా, ధైర్యసాహసాలతో వారి పై ప్రతి దాడి చేస్తూ పోరాడి వీరమరణం పొందారన్నారు. స్వాతంత్ర్యం తరువాత దేశభద్రత కోసం పోలీసులు ప్రాణాలు అర్పించిన మొట్టమొదటి సంఘటన అన్నారు. ఆ రోజు వాళ్ళు చేసిన త్యాగాలను గుర్తించి, గౌరవించి, దేశ వ్యాప్తంగా అమరవీరుల దినోత్సవంను అక్టోబర్ 21వ తేదిన జరుపుకుంటూ అమరవీరులకు శ్రద్ధాంజలి నిర్వహిస్తు న్నామన్నారు. ఒకరి కోసం చేసే త్యాగం ఉన్నతమైనదైతే ప్రజారక్షణ కోసం చేసే త్యాగం మహోన్నతమైనదన్నారు. అమరవీరులను ఆదర్శంగా, స్ఫూర్తిగా తీసుకుంటూ పోలీసు అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటున్నామన్నారు. అమరవీరుల కుటుంబ సభ్యులతో మాట్లాడి, వారి సమస్యలను పరిష్కరించడం మరియు వారి కష్టాలకు అండగా నిలబడుతున్నామన్నారు. జిల్లా ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామన్నారు. దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో వీరమరణం పొందిన 216 మంది పోలీసులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ, నివాళులర్పించి 2 నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం అమర వీరుల కుటుంబ సభ్యులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి, కలెక్టర్, ఎస్పీ శాలువతో సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ ఎం. మహేష్ కుమార్, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డిఎస్పీలు బాబు ప్రసాద్, శ్రీనివాసాచారి, శ్రీనివాస రావు, పోలీసు వేల్ఫేర్ డాక్టర్ స్రవంతి, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు నాగరాజు, సిఐలు, ఆర్ ఐలు, ఎస్సైలు, ఆర్ ఎస్సైలు, పోలీసు అమరవీరుల కుటుంబాలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మహిళల పై.. పెరుగుతున్న అత్యాచారాలు

**- ఘటన పై పవన్ కళ్యాణ్ ఎందుకు నోరుమెదపడం లేదు - రాష్ట్రంలో హోంమంత్రి ఉన్నట్లా లేనట్లా**

**- అత్యాచారానికి పాల్పడిన వారిని వెంటనే ఎన్‌కౌంటర్ చేయాలి**

**- గతంలో ఉన్న దిశ యాప్‌ను రద్దు చేసి మహిళలకు భద్రత లేకుండా చేశారు - ఎమ్మెల్యే విరూపాక్షి**

**ఆలూరు రూరల్, అక్టోబర్21, ప్రభాతవార్త:** ఆలూరు ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో మహిళల పై మరియు చిన్నారుల పై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి విమర్శించారు. నంద్యాల, కడప జిల్లాల్లో చిన్నారులు, మహిళల పై అత్యాచారాలు, హత్యలు జరగడం బాధాకరమన్నారు. మహిళలకు అండగా ఉంటామని బల్లలు గుద్ది చెప్పిన రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఏం చేస్తున్నట్లు అని ఆయన ప్రశ్నించారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 30 మంది మహిళలు తప్పిపోయారంటూ పదే పదే చెప్పిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు వారి ఆచూకీ ఎందుకు తెలపడంలేదంటూ ఆయన ప్రశ్నించారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి పై నారా రాద్దాంతం చేశావని ఇప్పుడు ఏమి మాట్లాడడంలేదని ఆయన మండిపడ్డారు. పోరాటం చేసిన మహిళల పై కేసులు నమోదు చేస్తుంటే హోంమంత్రి హోదాలో ఉన్న మహిళ ఎందుకు మౌనంగా ఉన్నారంటూ ఆయన ప్రశ్నించారు. ఇలాంటి సంఘటనలు చూస్తుంటే రాష్ట్రంలో మహిళలకు, చిన్నారులకు రక్షణ కరువైందని ఇప్పటికైనా కూటమి ప్రభుత్వంలో భాగంగా



ఉన్న బీజేపీ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇలాంటి ఘటనలు జరగకుండా హోంశాఖకు ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోరారు.

# అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలి..!

**:- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్**



**ఆదోని, అక్టోబరు 21, ప్రభాతవార్త :** పిజిఆర్ఎస్ అర్జీలను నాణ్యతగా గడువులోగ పరిష్కారించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాయలంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం-పిజిఆర్ఎస్ కార్యక్రమంలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం లోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు నాణ్యతగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండ చూడాలన్నారు. వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండ ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, శ్రీనివాసరాజు, డిప్యూటీ డిఎంహెచ్ఓ సత్యవతి, డిఎల్‌డిఓ ప్రభాకర్‌రెడ్డి, డిఎల్‌పిఓ నూర్జహాన్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మజ, ఉపతహశీల్దారు వలిభాష తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్ బంకు ఏర్పాటుకై భూమిపూజ చేసిన డీయస్పీ

**- నాణ్యమైన పెట్రోల్ అందించేలా చర్యలు**

**- డీయస్పీ సోమన్న**



**ఆదోనిటౌన్, అక్టోబర్21, ప్రభాతవార్త;** ఆదోని పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పక్కన నూతనంగా పోలీసు వెల్ఫేర్ ఫండ్ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు ఏర్పాటుకు సోమవారం భూమిపూజ చేశారు. ఈ మేరకు డీయస్పీ సోమన్న, టూటౌన్ సీఐ సూర్యమోహనరావు పూజలు చేశారు. అనంతరం ప్రొక్లెయిన్ ద్వారా మట్టిని తీయించారు. ఈ సందర్భంగా డీయస్పీ, సీఐలు మాట్లాడుతూ నాణ్యమైన పెట్రోల్‌ను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. పెట్రోల్ నుంచి వచ్చే ప్రతిఒక్క రూపాయి పోలీసు వెల్ఫేర్ ఫండ్‌కు వెళ్తుందన్నారు. 45 రోజుల్లో పెట్రోల్ బంకు నూతన నిర్మాణం పూర్తి అవుతుందన్నారు. వారితో పాటు ఎస్ఐ తిరుపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి అర్జీకి సత్వర పరిష్కారం

**కర్నూలు మున్సిపల్, అక్టోబర్ 21, ప్రభాతవార్తః** ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చే ఆర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ సంబంధిత అధికారులను అదేశించారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 14 ఫిర్యాదులు వచ్చాయి. వాటన్నింటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ అధికారులను అదేశించారు. పరిష్కారవేదిక కార్యక్రమంలో వచ్చిన కొన్ని వినతులు 19వ వార్డు జోరాపురం రహదారి పార్కుస్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలని భారతీయ జనతాపార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం రాంమోహన్‌రెడ్డి కోరారు. నగరంలో భవిష్యత్తులో చేపట్టే సచివాలయ ఉద్యోగుల బదిలీలను కౌన్సిలింగ్ ద్వారా పారదర్శకంగా చేపట్టాలని ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు బి బతుకన్న కోరారు. ఒమెగా హాస్పటల్ సమీపంలో శ్రీవారి దర్శనం కాలనీ నందు తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానికులు ఆర్జీ ఇచ్చారు. బళ్లారి చౌరస్తా సమీపంలోని హనుమాన్ కట్ట రాజీవ్ నగర్ ప్రాంతాల్లో రహదారులు వీధి దీపాల మరమ్మత్తులు చేపట్టాలని న్యాయవాది గుండ్ల రాజేష్ కోరారు.



# విధి నిర్వహణలో ప్రాణత్యాగము చేసిన పోలీసుల సేవలు మరువలేనివి

**: పోలీసు మరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం**

**నంద్యాల అక్టోబరు 21, ప్రభాతవార్తప్రతినిధి** విధి నిర్వహణలో ప్రాణాలను తృణ ప్రాయంగా బావించి ప్రజల శ్రేయస్సుకై ప్రాణత్యాగము చేసిన పోలీసుల సేవలు మరువ లేనివని జిల్లా కలెక్టరు రాజకుమారి అన్నారు. సోమవారము నంద్యాల పట్టణంలోని బొమ్మల సత్రము సమీపములోగత జిల్లా పోలీసు కార్యాలయంలో అమరవీరుల సంస ్మరణ కార్యక్రమము జిల్లా యస్‌పి అదిరారాజ్ సింగ్‌రాణా అద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పేరెడే కమాండుర్ నాగభూషణము నుండి జిల్లా కలెక్టరు యస్‌సి గౌరవ వందనము స్వీకరించారు. అనంతరము ఎఅర్ డియస్‌పి శ్రీనివాసులు విధి నిర్వహణలో మరణించిన వారి వివరాలను అందరికీ తెలియజేశారు. ఈ సందర్భముగా జిల్లా కలెక్టరు జి రాజకుమారి మాట్లాడుతూ విధి నిర్వహణలో పోలీసు రక్షణ బాధ్యతలను నిర్వర్తిస్తూ ప్రాణాలను కోల్పవడము



ఎంతో లెక్కచేయకుండా ప్రజల శ్రేయస్సుకై ప్రాణాత్యగం చేసిన పోలీసులను సైతము లెక్కచేయకుండా ప్రజల శ్రేయస్సుకై ప్రాణాత్యాం చేసిన పోలీసుల సేవలు మరువ లేవన్నారు. పోలీసు ఉద్యోగము అన్నది ఎంతో స్ఫూర్తిదాయకమైన గౌరవ ప్రదమైన అత్యంత బాద్యతా యుతమైనదన్నారు. ఎండను పగలనేక రాత్రనక వర్షాన్ని ఎండను లెక్క చేకుండా కఠిన పరిస్థితుల్లో కూడా ప్రజలరక్షణ కోసం పని చేస్తుంటారన్నారు. మహిళలపై జరిగే నేరాలతో పాటు అతిసున్నితమైన విషయాలో కూడా చాకచక్యముగా వ్యవహరించాల్సి ఉంటుంద న్నారు. శాంతి భద్రతలకు విఘాతము కలగకుండా ఎలాంటి కష్టము వచ్చిన మేమున్నామని ముందు నిలబడి విదులు నిర్వహిస్తున్న పోలీసు ఉద్యోగులం దరికి పేరు పేరున అబినందనలు తెలిపారు. పోలీసుల అమర వారులను స్మరించుకుఏంటూ వారి అత్మకు శాంతి చేకూరాలని ఘనంగా నివాళ్ల అర్పిస్తూ అమరవీరుల కుటుంబాలకు జిల్లా యంత్రంగా తరుపున అండగా ఉంటామని కలెక్టరు తెలిపారు. జిల్లా యస్‌పిఅదిరాజ్‌సింగ్ రాణా మట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగనిరతిని స్మరించుకుంటూ ప్రతి సంవత్సరము అక్టోబరు 21వ తేదిన పోలీసు అమర వీరులు సంస్కరణ దినంగా జరుపుకుంటామన్నారు. దేశ రాష్ట్ర భ ద్రత కోసం రాత్రింబవళ్ల పోలీసులు తమ ప్రాణాలను పెట్టి విదులు నిర్వహిస్తారన్నారు. అమరవీరుల త్యాగాలను సేవలను సింహావలోకనం చేసుకుంటూ సేవ యొక్క అర్థాన్ని పరమర్థాన్ని గుర్తిస్తూ కొనియాడారు

# గొర్రెల నట్టల నివారణ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**నందికొట్కూరు, అక్టోబర్ 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో గొర్రెలు మరియు మేకల నట్టల నివారణ సామూహిక కార్యక్రమాన్ని నియోజక వర్గం ఎమ్మెల్యే గిత్తా



జయసూర్య ప్రారంభించారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధశాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సంధర్బంగా నంద్యాల డివిజన్ ఉప సంచాలకులు డా. శ్రీనువాసరావు మాట్లాడుతు నట్టల నివారణ వలన జీవాల పొట్టలో వుండె నులిపురుగులు, పొట్టజలగలు, బద్దె పురుగులు వలన కలిగే నష్టాలను వివరిస్తూ నట్టల నివారణ ప్రాముఖ్యతను తెలియజేశారు. వర్షాకాలంలో, చలికాలంలో జీవాలను ఏ విధంగా రక్షించుకోవాలి మరియు నట్టల నివారణ వలన కలిగే ఉపయోగాలను డా. పార్థసారధిరెడ్డి తెలిపారు. దాదాపు 600 వందల జీవాలకు నట్టల నివారణ మందులు త్రాగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిన్న నాగలక్ష్మయ్య, పశుసంవర్ధశాఖ నందికొట్కూరు ప్రాంతీయ పశువైద్యశాఖ సహాయ సంచాలకులు డా. వరప్రసాద్, అల్లూరు వెటర్నరీ ఆ.పి.షణ్ముకరాజు, కొణిదేల వెటర్నరి డడా. నవీన్‌కుమార్‌రెడ్డి, బ్రాహ్మణకొట్కూరు డా. డి.నిర్మలాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

# తక్షణమే సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే కెఈ శ్యాంబాబు



**మద్దికెర, అక్టోబరు 21, ప్రభాతవార్త** మండల కేంద్రమైన మద్దికెరలో మండల పరిషత్ కార్యాలయం నందు సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ (ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇచ్చుట)లో ఎమ్మెల్యే కెఈ శ్యాంబాబు ప్రజల నుండి వచ్చిన అర్జీలను తక్షణమే అధికారులను పిలిపించి పరిష్కరించడం జరిగింది. అందరు అధికారులు అర్జీలను తీసుకుని మూలకు పడేయగా ఎమ్మెల్యే అలా చేయకుండ తక్షణమే సంబంధిత అధికారులను పిలిపించి సమస్యను పరిష్కరించడంతో ఇలా పనిచేసే ఎమ్మెల్యేను ఎప్పుడు చూడలేదని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏదైనా ప్రజల సమస్యలు తీర్చిన వ్యక్తి నిజమైన నాయకుడు అని కొనియాడరు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కొండయ్య, ఎంపిపి అనిత, గూడూరు ధనుంజయుడు, రాజన్న, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# బిజెపిలో చేరిన నాగలాపురం మాజీ సర్పంచ్ వీరారెడ్డి



**ఆదోని, అక్టోబరు 21, ప్రభాతవార్త** మండల పరిధిలోని నాగలాపురం మాజీ సర్పంచ్ వీరారెడ్డి మరియు వారి కుమారుడు ప్రస్తుత సర్పంచ్ కోటా పరమేష్‌తో పాటు 150కుటుంబాలు సోమవారం వైసిపి పార్టీని వీడి బిజెపి పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి బిజెపి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ బిజెపి పార్టీ యొక్క సిద్ధాంతం నరేంద్రమోడీ ఆలోచన విధానం నచ్చి బిజెపిలో చేరామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ఈ ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి చేసి ప్రజలకు మేలు చేస్తారని బిజెపి పార్టీలో చేరామన్నారు. నేటి నుండి బిజెపి పార్టీ సిద్ధాంతాలకు మేము కట్టుబడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కునిగిరి నీలకంఠ, మాజీ ఎంపిపి పంపాపతి, కల్లుపోతుల సురేష్, చిన్న, ఉషా రాజ్, రంగస్వామి తదితరులున్నారు.

# రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి తోడ్పడాలి

**- సీసీ రోడ్డుకు భూమిపూజ చేసిన ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి**

**ఆలూరు రూరల్, అక్టోబర్21, ప్రభాతవార్త:** ఆలూరు నియోజకవర్గంలో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి సూచించారు. సోమవారం ఆలూరులో ఉరుకుంద ఈరన్న కొట్టాలల్లో ఎంపిపి నిధులు రూ.6లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే విరూపాక్షి భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పట్టింపులను పక్కనపెట్టి ప్రతిఒక్కరు అభివృద్ధికి కృషి చేయాలన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎటువంటి సమస్యలు తలెత్తినా వారికి అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రంగమ్మ తనయుడు వీరేష్, ఎంపిటిసి గౌడప్ప , ఎల్లమ్మ, వైసీపీ నాయకులు మంగమ్మ, కో కన్వీనర్ వీరేష్, వార్డుమెంబర్లు పాల్గొన్నారు.



# క్రీడాకారులు చక్కని క్రీడా స్పూర్థిని ప్రదర్శించాలి



**నంద్యాల, అక్టోబర్ 21, ప్రభాతవార్త. ప్రతినిధి:** క్రీడాకారులు చక్కని క్రీడా స్పూర్థిని ప్రదర్శించాలని పలువురు వక్తలు తెలిపారు. సోమవారం రెండవ రోజు ఎస్.జి.యఫ్. రాష్ట్ర స్థాయి అండర్-17 ఫెన్సింగ్ బాలబాలికల క్రీడలు స్తానిక పద్మావతి నగర్ డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటి ఇండోర్ స్టేడియం నందు నంద్యాల జిల్లా 14/17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వాహాక కార్యదర్శి శ్రీనాథ్ ఆధ్వర్యంలో కొనసాగాయిజ ఈ కార్యక్రమానికి బార్ అసోసియేషన్ అధ్యక్షులు సీనియర్ అడ్వకేట్ రావినూతన జుంకా ప్రసాద్, నంద్యాల జిల్లా బిజెపి కో-ఆర్డినేటర్ అభిరుచి మధు, బిజెపి ఇన్‌చార్జ్ రమేష్‌నాయుడు, ఫెన్సింగ్ స్టేట్ అబ్జర్వర్ రాఘవేంద్ర, ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యూకేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నిమ్మకాయ సుధాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతు క్రీడల ద్వారా కమ్యూనికేషన్స్, స్కిల్స్ మరియు స్నేహ భంధాలు మెరుగులవుతాయని, గెలుపు ఓటమిలను సమానంగా స్వీకరించి క్రీడా స్పూర్థిని ప్రదర్శించాలన్నారు. అనంతరం సాయంత్రం జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎం.ఎన్.వి, రాజు హాజరై బాలబాలికలకు ఇప్పి, షాబర్ పాయిల్ టీం ఈ వెంట్ల విజేతలకు మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపి స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యూకేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏ.పి.రెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు నాగేంద్ర.దండే నాగరాజు, ఏ.పి.పి.ఈ.టి. అండ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యూకేషన్ ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఫిజికల్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

**ప్యాపిలి అక్టోబరు21(ప్రభాతవార్త):** దేశ రక్షణ కోసం పోలీసు అమరవీరులు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని ప్యాపిలి ఎస్సై మధుసూధన్ అన్నారు. ప్యాపిలి పోలీసుస్టేషన్‌లో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. సమాజంలో ప్రజల ప్రాణ, మాన, ఆస్తుల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. విధి నిర్వహణలో పోలీసులకు ప్రజలు తమ వంతు సహాయ సహకారాలను అందించాలని కోరారు. దేశరక్షణలో అనేక మంది జవాన్లు, విధి నిర్వహణలో పోలీసు అధికారులు ప్రాణత్యాగం చేశారని తెలిపారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసుస్టేషన్, ఆర్టీసి బస్టాండు



వద్ద ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శంకుస్థాపనే చేసిన.. 1026 పనులను జనవరి 15లోగా పూర్తి చేయండి

**నంద్యాల, అక్టోబరు 21, ప్రభాతవార్తప్రతినిధి** పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలల్లో శంకుస్థాపన చేసిన 1026 పనులను వచ్చే జనవరి 15లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టరు రాజకుమారి యంపిడిఓలు పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అదికారులను అదేశించారు. సోమవారము కలెక్టరేట్ లోని సెంటినరీ హాల్లో ప్రజా సమస్యల పరిస్కార వేదికలో బాగంగా సాగు నీటి వినియోదారుల సంఘాల ఎఇన్నకలు పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు స్వీప్ ఈ అఫీసు రెవెన్యు సదస్సులు 200 ఒవల రోజుల కార్యచరణ ప్రణాళిక కోర్టు కేసులకు సంబందించి అంశాలపై సమీక్ష నిర్వహించారు. జేసి విష్ణుచరణ్ డిఅర్‌వో పద్మజ, స్పెషల్ డిప్యుటి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్బముగా కలెక్టరు మాట్లాడుతూ పల్లె పండుగ, పంచాయితీ వారోత్సవాలలో జిల్లా వ్యాప్తంగా సిసిరోడ్డు బిటి రోడ్లు డ్రైనేజికి సంబందించి 1026 పనులకు శంకుస్థాపన చేశామని వచ్చే ఏడాది జనవరి 15లోగా పూర్తి చేస్తామని డిప్యుటి సియం వీడియో కాన్ఫరెన్సులో మాటా ఇచ్చామని ఈ మేరనకు పనులు ప్రారంబించి పూరిత చేసేందుకు ప్రత్యేక శ్రర్ధ తీసుకోవాలన్నారు. ఇందుకు సంబందించి 368 మంది వెండర్స్ రిజిస్టేషన్‌పూర్తియిందని మిగిలిన వెండర్స్ రిఇజిస్టేషపన్ ప్రక్రియను మంగలవారము సాయంత్రములోగా పూర్తి చేయాలని యంపిడిఓలను



కలెక్టరు అదేశించారు. జిల్లాఓని సాగు నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సంబందించి నోటిపికేషన్ జారీ చేస్తున్నామని షెడ్యూల ప్రకారము ఎన్నికలను సజావుగా నిర్వమించేందుకు పటిష్ట ప్రణాళిక ^హాపొందించుకోవాలని మండల తహశీలుదార్లు ఇంజనీరింగు అదికారులనరు కలెక్టరు అదేశించారు. నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సంబందించి అంశాలను క్షుణంగా చదువాలన్నారు. వెబ్ ల్యాండ్ ప్రకరాము కాకుండా సాగులో ఉన్న వ్యక్తుల పేర్లు మాత్రమే ఓటర్లు జాబితాలో పొందుపరచాలన్నారు. సాగు నీటి సంఘాల ఎన్నికలను ప్రతిష్టాత్మకముగా తీసుకుని విజయవంతము చేయాలన్నారు. జిల్లాఓ 122 కార్యాలయాలు ఉన్నాయని కార్యాలయాపు దస్త్రాలన్ని ఈ అఫీసు ద్వారానే రావాలని వచ్చిన ఫైలన్నింటిని ఒకటి రెండు రోజుల్లో క్లియర్ చేస్తున్నప్పటికి ఈఅఫీసు ద్వారా పంపడానాకి ఇబ్బంది ఏంటని కలెక్టరు ప్రశ్నించారు. తాను అమోదము తెలిపిన ఫైళ్లకు సంబందించి ప్రొసీడింగ్ ఉత్తర్వులు ఇవ్వడములో తీవ్ర జాప్యము చేస్తున్నారని అసంతృప్తి వ్యకక్తం చేశారు. ఇకపై ఉత్వర్లుఉ జారీ చేయడము అలశ్యము అయితే సంబందిత వ్యక్తులపై కఠిన చర్యలు తప్పనవని అమె తెలిపారు. సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల సౌలభ్యము కొరకు ట్యూబ్‌లైట్లు ఫ్యానలు జిల్లా అదికారులు విరాళాలుగా చ్చినప్పటికి సంబందిత మెటీరియల్నఉ సంక్షేమ వసతిగేమాలల్లో ఏర్పాటు చేయడమంలో సాంఘిక సంక్షేమ గిరిజిన సంక్షేమ అదికారులువిఫలం కావడముపై అగ్రహము వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో గోల్డుమెడల్ సాధించిన క్రీడాకారుల వివరాలు... ఆత్మకూరు చదువుకుంటూ వాలీబాల్ క్రీడలో ప్రతిభ చూపించి 1985లో ఉదో ్యగం సాధించి సికింద్రాబాద్ రైల్వేలో ఉద్యోగం చూస్తూ పుట్టిన ఊరికి క్రీడాకారులకు ప్రత్యేక గుర్తింపు తీసుకరావాలనే లక్ష్యసాధనతో కోచ్‌గా ఉంటూ నిమ్మి కృష్ణయాదవ్ స్పోర్ట్స్‌క్లబ్ ఎన్నో సేవలు అందిస్తున్నారు. వాలీబాల్ అధ్యక్షునిగా, సెక్రటరిగా కొనసాగిస్తూ పస్పిల్‌మున్నా సహకారంతో అన్ని విదాలుగా సహయం అందిస్తున్నారు. మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన నందన వెంకటేశ్వరగౌడ్ అనే యువకుడు స్పోర్ట్స్‌క్లబ్ కబడ్డి శిక్షణ తీసుకోని 2018 సంవత్సరంలో జాతీయ స్థాయి కబడ్డి పోటీలో గోల్డుమెడల్ సాధించారు. ఆత్మకూరు పట్టణానికి చెందిన టపాల్ జూనైద్ అనే క్రీడాకారుడు స్పోర్ట్స్‌క్లబ్ తరపున శిక్షణ పొంది హిమాచల్ ప్రదేశ్‌లో డ్యాబాల్‌లో ప్రతిభ చూపి గోల్డుమెడల్ సాధించారు. నేపాల్ హ్యాండ్‌బాల్ క్రీడలో ప్రతిభ చూపించి జాతీయ స్థాయిలో గోల్డుమెడల్ సాధించారు. ఇలా చెబుకుంటూ పోతే ఎంతో మంది క్రీడాకారులు ఉత్సహంగా స్పోర్ట్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ముందుకు దూసుకెళ్లారు.